PRGI NO TGTEL/26/A2948

జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

జ్యోతి
# శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్ ॥సంపుటి:1 ॥ సంచిక: 10 ॥ మంగళవారం ॥ 9-6-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-







## విశాఖ స్టీల్ ప్లాంట్‌లో.....

# 9 మంది సజీవ దహనం

### మృతుల సంఖ్య పెరిగే అవకాశం

**ప్రమాదంపై ప్రధాని దిగ్భ్రాంతి, ఎక్స్‌గ్రేషియా ప్రకటన**

**బాధితుల సమాచారం కోసం కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్**

కనురెప్పపాటులో ముంచెత్తిన ఉక్కు లావా.. కరిగిపోయిన దేహాలు.. గాల్లో కలిసిపోయిన ప్రాణాలు! కళ్లెదుటే తోటి కార్మికులు సజీవదహనమవుతుంటే ఏమీ చేయలేక, కాపాడలేక కన్నీరు మున్నీరైన సహచరులు. 1500 డిగ్రీల నరకాన్ని చూసి విశాఖ ఉక్కు గుండె పగిలింది.. కార్మిక లోకం కంటతడి పెట్టింది!

విశాఖపట్నం, జూన్ 08: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో ఊహించని రీతిలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ప్లాంట్‌లోని స్టీల్ మెల్టింగ్ స్టేషన్-2 విభాగంలో ఉక్కుద్రవాన్ని తరలిస్తున్న క్రమంలో జరిగిన భారీ పేలుడు తొమ్మిది మంది అమాయక కార్మికుల ప్రాణాలను బలితీసుకుంది. కను రెప్పపాటు కాలంలో జరిగిన ఈ దుర్ఘటనతో ప్లాంట్ ప్రాంగణం మొత్తం ఒక్కసారి గా అరుపులు, కేకలతో రణరంగంగా మారింది. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ విధుల్లో ఉన్న కార్మికులు, ఉద్యోగులు భయాందోళనలతో ప్రాణాలు అర చేతిలో తరువాయి 2 వ పేజీలో...



## 2027 నాటికి భూ రికార్డులు

# క్లీన్!

### సిద్ధాంతం మీ భూమి- మీ హక్కు సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

గత పాలకుల తుగ్లక్ నిర్ణయాలు, అవకతవకల కారణంగా రాష్ట్రంలో భూ రికార్డుల వ్యవస్థ పూర్తిగా గందరగోళంగా తయారైందని, దీనిని పూర్తిగా ప్రక్షాళన చేసి ప్రజలకు నమ్మకమైన, తప్పుల్లేని రికార్డులను అందించేందుకు మూడేళ్ల సమయం పడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 2027 నాటికి రాష్ట్రంలో ప్రతి రైతు చేతిలో ఎలాంటి తప్పులు లేని పక్కా పాస్ పుస్తకం ఉంటుందని హామీ ఇచ్చారు.

ఆచంట, జూన్ 08: పశ్చిమ గోదావరి జిల్లా సిద్ధాంతంలో నిర్వహించిన మీ భూమి- మీ హక్కు కార్యక్రమంలో సీఎం పాల్గొని, రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు పంపిణీ చేశారు. దేశ చరిత్రలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో బ్లాక్ చైన్ ఆధారిత భూ రికార్డుల వ్యవస్థను అమలు చేస్తున్నామని సీఎం ప్రకటించారు. దీని కింద ప్రతి ల్యాండ్ యూనిట్‌కు ఒక శాశ్వత 'బ్లాక్ చైన్ ఐడీ'ని కేటాయిస్తున్నామని, దీనివల్ల భవిష్యత్తులో రికార్డులను ట్యాంపరింగ్ చేసే లేదా మార్చే అవకాశం ఎవరికీ ఉండదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం భూముల తరువాయి 2 వ పేజీలో...



## మహా నగరంలో...

# పేదలకు లక్ష ఇళ్లు

### ట్రాఫిక్, కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్

### సైబరాబాద్‌లో 1,674 కోట్ల పనులకు శంకుస్థాపన

**మోదీ ఏం చేశారు.. మేమేం చేశాం?.. చర్చకు సిద్ధమా? సీఎం రేవంత్ సవాల్**

దేశాన్ని ఏలుతున్న ప్రధాని మోదీ ఏం చేశారు? రాష్ట్రంలో మేమేం చేశామో బహిరంగ చర్చకు సిద్ధం. పదేళ్ల కేసీఆర్ పాలన, పన్నెండేళ్ల మోదీ పాలన, మా 30 నెలల పాలనపై ఎవరెన్ని నిధులు తెచ్చారో చర్చిద్దాం రండి అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు.

హైదరాబాద్, జూన్ 08: రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను గెలిపిస్తే తెలంగాణకు ఏంచేశారని, కేంద్ర ప్రాజెక్టులకు ఎందుకు అడ్డుపుల్లలు వేస్తున్నారని ఆయన సూటిగా ప్రశ్నించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ. 1,674.74 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం స్థానికంగా ఏర్పాటు తరువాయి 2 వ పేజీలో...



### తెలంగాణను తాకిన రుతుపవనాలు

**గద్వాల జిల్లాలోకి నైరుతి**

**2-3 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ**

హైదరాబాద్, జూన్ 8 (ఈవార్తలు): తెలంగాణకు గుడ్ న్యూస్. నైరుతి రుతుపవనాలు సోమవారం రాష్ట్రాన్ని తాకాయి. గద్వాల జిల్లాలోకి ప్రవేశించాయి. నైరుతి రుతుపవనాల రాకతో వర్షాకాలం ప్రారంభమైందని భావిస్తాం. ఇప్పటికే ఇవి కేరళ, తమిళనాడు, కర్ణాటకలో పూర్తిగా విస్తరిం చాయి. ఏపీ, మహారాష్ట్రలో 30 శాతం తరువాయి 2 వ పేజీలో...




### మనం కలిసి ఉంటేనే బలం

**నాకు మిత్ర పక్షాలు మద్దతివ్వలే**

**ఇండియా కూటమి భేటీలో రాహుల్**

**టీఎంసీ, వామపక్షాలపై అసహనం**

**రెండ్నెల్లకోసారి భేటీ కావాలని నిర్ణయం**

**ఆగస్టు 8న హైదరాబాద్‌లో తుదుపరి భేటీ**

బీజేపీని ఓడించడం అంత పెద్ద కష్టమేమీ కాదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు.దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం జరిగిన ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల భేటీకి మొత్తం 23 పార్టీలు హాజరయ్యాయి. ఈ సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడ్నరీ.. 'ఐకమత్యమే మహాబలం'అనే సందేశం ఇచ్చారు.

న్యూఢిల్లీ: 'కలిసుంటే బలం.. విడిపోతే పతనం' అని ఆయన నొక్కి చెప్పారు. మన ఉమ్మడి ప్రత్యర్థి అయిన బీజేపీ నుంచి ఎదురయ్యే సవాలును తిప్పికొట్టడానికి మిత్రపక్షాలు కలిసి పనిచేయాల్సిన అవసరాన్ని గుర్తించాలని రాహుల్ గాంధీ హెచ్చరించారు. అలాగే, మిత్రపక్షాలను ఒకరినొకరు కించపరచుకోవద్దని రాహుల్ గాంధీ హెచ్చ రించారు. "దేశం, రాజ్యాంగ పరిరక్షణ కోసం" బీజేపీకి వ్యతిరేకంగా కలిసి పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. దాదాపు 15 నిమిషాల పాటు తరువాయి 2 వ పేజీలో...




### హర్మూజ్ సమీపంలో భారతీయ నౌకపై దాడి

**నౌకలో 24 మంది భారతీయ సిబ్బంది**

టెహ్రాన్: పశ్చిమాసియాలో మరోసారి ఇజ్రాయెల్, ఇరాన్ దాడులతో భయాం దోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రపంచ ఇంధన సరఫరాకు కీలకమైన హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు కొనసాగుతుండగా.. ఒమన్ తీరంలో

# నేటి రాశి ఫలాలు

**మేషం :** మిశ్రమ వాతావరణం ఉంటుంది. కొన్ని పరిస్థితులు ఇబ్బందిపెడతాయి. చంచలబుద్ధితో వ్యవహరించి తప్పుడు నిర్ణయాలు తీసుకుంటారు. గోసేవ మంచి ఫలితాలను ఇస్తుంది.

**వృషభం :** బలమైన సంకల్పంతో పనిచేయాలి. ప్రారంభించిన పనులు సకాలంలో పూర్తవుతాయి. ఒక శుభవార్త మీ ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. మీ ప్రతిభను పెద్దలు ప్రశంసిస్తారు. అవసరాలకు డబ్బు అందుతుంది. నూతన వస్తువులను కొనుగోలు చేస్తారు. ఆదిత్య హృదయ పారాయణ శుభప్రదం.

**మిథునం :** ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేసుకుంటారు. కీలక అంశాల్లో పెద్దలను సంప్రదించడం ఉత్తమం. రుణ సమస్యలు తగ్గుతాయి. ఇష్టదేవతా ఆరాధన శుభప్రదం.

**కర్కాటకం :** గ్రహబలం మిశ్రమంగా ఉంది. మంచి ఆలోచనలతో ముందుకు సాగాలి. ప్రారంభించబోయే పనిలో ఉత్సాహంగా ముందుకు సాగాలి. ఎన్ని ఆటంకాలు ఎదురైనప్పటికీ వాటిని అధిగమించే ప్రయత్నం చేస్తారు. మీ కీర్తిప్రతిష్టలు పెరుగుతాయి. ముఖ్యమైన కార్యక్రమంలో బంధుమిత్రులను కలుపుకొనిపోవడం మేలు. నవగ్రహ స్తోత్రం చదివితే బాగుంటుంది.

**సింహం :** ఒక వార్త ఆనందాన్ని కలిగిస్తుంది. బంధుమిత్రులతో కలిసి చేసే పనులు సత్ఫలితాన్ని ఇస్తాయి. ఒక ముఖ్య వ్యవహారంలో మీరు ఆశించిన పురోగతి ఉంటుంది. ఆదిత్య హృదయం పఠించాలి.

**కన్య :** ప్రారంభించబోయే పనుల్లో శ్రమ పెరుగుతుంది. ఆత్మీయుల సహాయ సహకారాలు మేలు చేస్తాయి. శత్రువులు మిత్రులు అవుతారు. ముఖ్యమైన కొనుగోళ్లు చేస్తారు. శ్రీవేంకటేశ్వరస్వామి సందర్శనం శక్తిని ఇస్తుంది.

**తుల :** ఉద్యోగ, వ్యాపారపరంగా అనుకూలత ఉంది. తోటివారితో ఆనందంగా గడుపుతారు. బంధుమిత్రులతో సత్సంబంధాలు ఏర్పడతాయి. కీలకమైన చర్చలు ఫలిస్తాయి. ఇష్టదైవ ధ్యానం శుభప్రదం.

**వృశ్చికం :** శుభ భవిష్యత్తు కనిపిస్తోంది. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి, ఉద్యోగాల్లో గొప్ప ఫలితాలు ఉన్నాయి. ఒక శుభవార్త మీ మనోధైర్యాన్ని పెంచుతుంది. సూర్యారాధన మేలు చేస్తుంది.

**ధనుస్సు :** శ్రమకు తగిన ఫలితం ఉంటుంది. ఒక వ్యవహారంలో తోటివారి సాయం అందుతుంది. శుభ కార్యక్రమాలలో పాల్గొంటారు. అవసరానికి డబ్బు అందుతుంది. ఆదిత్య హృదయం పఠించాలి.

**మకరం :** మిశ్రమ ఫలితాలు ఉన్నాయి. కీలక విషయాల్లో తోటివారి సలహాలు తప్పనిసరి. కొందరి ప్రవర్తన మీకు ఇబ్బంది కలిగిస్తుంది. శత్రువులతో జాగ్రత్త. సమయాన్ని వృథా చేయకండి. నవగ్రహ ఆరాధన శుభప్రదం.

**కుంభం :** పనులకు ఆటంకాలు కలుగకుండా చూసుకోవాలి. మనోబలం తగ్గకుండా చూసుకోవాలి. ఓర్పు చాలా అవసరం. అనవసర భయాందోళనలను దరిచేరనీయకండి. నవగ్రహ ధ్యాన శ్లోకం చదివితే మంచిది.

**మీనం :** కాలం అనుకూలిస్తోంది. మనోధైర్యంతో అనుకున్నది సాధిస్తారు. ఒక పనిలో అధికారుల నుంచి మీకు ప్రశంసలు లభిస్తాయి. అర్థ, వస్త్ర లాభాలు ఉన్నాయి. ఇష్టదేవతా శ్లోకాలు చదివితే బాగుంటుంది.





# 9 మంది సజీవ దహనం

మొదటి పేజీ తరువాయి

ల్యాడిల్ ద్వారా కన్వేయర్ సహాయంతో పైకి లిఫ్ట్ చేస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. సాంకేతిక లోపం కారణంగా ఆ ల్యాడిల్స్ ఒక్కసారిగా కుప్పకూలి, పెద్ద శబ్దంతో పేలిపోయాయి. దాంతో, మరుగుతున్న ఉక్కు ద్రవం అంతా కింద పనిచేస్తున్న కార్మికులపై లావా లాగా ఉప్పొంగి పడింది. ఈ తీవ్రమైన వేడికి ఎనిమిది మంది కార్మికులు అక్కడికక్కడే సజీవదహనం కాగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మృతి చెందారు. పలువురు కార్మికులు ఒళ్లంతా తీవ్ర గాయాలతో చికిత్స పొందుతుండగా, ఇద్దరి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం.

### కన్నీరు మున్నీరవుతున్న కుటుంబాలు.. మృతుల వివరాలు

ఈ ప్రమాదంలో మరణించిన వారిలో ఐదుగురు విశాఖ స్టీల్‌ప్లాంట్ శాశ్వత ఉద్యోగులు కాగా, ముగ్గురు కాంట్రాక్ట్ కార్మికులు ఉన్నట్లు అధికారులు ధృవీకరించారు. మృతులను అప్పారావు, ప్రభాకర్‌రావు, కృష్ణ, రమణ, త్రినాథ్, అప్పలరాజు, కుమార్‌లుగా గుర్తించారు. మిగిలిన ఇద్దరి వివరాలు తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న బాధితుల కుటుంబ సభ్యులు ప్లాంట్ వద్దకు, ఆసుపత్రులకు చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు ప్లాంట్ వైద్యాధికారులు, స్థానిక ప్రైవేట్ ఆసుపత్రుల సిబ్బంది అత్యవసర చర్యలు చేపట్టారు. ప్రమాద తీవ్రత దృష్ట్యా మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### హుటాహుటిన రంగంలోకి హోంమంత్రి అనిత..

ప్రమాద వార్త తెలిసిన వెంటనే విజయనగరం పర్యటనలో ఉన్న రాష్ట్ర హోంమంత్రి అనిత తన కార్యక్రమాలను రద్దు చేసుకుని హుటాహుటిన విశాఖకు చేరుకున్నారు. విశాఖ ఎంపీ భరత్‌తో కలిసి ఆమె ఘటనా స్థలాన్ని పరిశీలించి, ప్రమాదం జరిగిన తీరును కార్మికులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందే ఆమె జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్‌లతో ఫోన్‌లో మాట్లాడి సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. బాధితుల సమాచారం కోసం విశాఖ జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. వివరాల కోసం 089125 90100, 089 125 90102 నంబర్లను సంప్రదించవచ్చని అధికారులు ప్రకటించారు.

### దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు

విశాఖ స్టీల్‌ప్లాంట్ దుర్ఘటనపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

మృతుల కుటుంబాలకు ప్రధాని మోదీ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, పీఎం నేషనల్ రిలీఫ్ ఫండ్ కింద మృతుల కుటుంబాలకు రూ.2 లక్ష లు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. సీఎం చంద్రబాబు నాయుడు అధికారులతో సమీక్ష జరిపి, అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఆదేశించారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కూడా ఘటనపై స్పందిస్తూ.. కార్మికుల భద్రతకు తాము కట్టుబడి ఉన్నామని, ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు.

# మనం కలిసి ఉంటేనే బలం

మొదటి పేజీ తరువాయి

ప్రసంగించిన రాహుల్.. 'ఓట్ చోరీ' సహా కొన్ని అంశాల్లో కూటమిలోని కొన్ని భాగస్వామ్య పార్టీల నుంచి కాంగ్రెస్‌కు సరైన మద్దతు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తృణమూల్ కాంగ్రెస్, వామపక్షాల వంటి పార్టీలపై రాహుల్ అసహనం వ్యక్తం చేసినట్టు వర్గాలు తెలిపాయి. ఇక, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించిన ఆందోళనను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లాలనే ఏకాభిప్రాయానికి వచ్చింది. ఈ లేఖను వీలైనంత త్వరగా ప్రధాన న్యాయమూర్తికి సమర్పించాలని ఇండియా కూటమి భావిస్తోంది. గత లోక్‌సభ ఎన్నికల ఫలితాలను ఉదహరిస్తూ బీజేపీని 'ఓడించడం కష్టం' కాదని రాహుల్ గాంధీ ఉద్ఘాటించారు. నిరంతర అంతర్గత కలహాల ద్వారా ప్రతిపక్షం తనను తాను బలహీనపరుచుకోకుండా ఉండాలని ఆయన అన్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 240 సీట్లకే పరిమితమైంది. 2019లో ఆ పార్టీ సొంతంగా 303 స్థానాల్లో గెలిచింది. ఇక, కాంగ్రెస్ 99 స్థానాల్లో గెలిచి, 2019 కంటే (52) మెరుగైన ఫలితాలు సాధించింది. కేంద్రం తీసుకొచ్చిన డీలిమిటేషన్ బిల్లును ఓడించడానికి ప్రతిపక్షాలు ఏకతాటిపైకి రావడం లోక్‌సభలో ఐక్యతకు తాజా ఉదాహరణ. "2026 ఏప్రిల్ 17న మోదీ ప్రభుత్వ దురుద్దేశపూరిత డీలిమిటేషన్ బిల్లులను ఓడించడానికి మనమందరం ఏకమై లోక్‌సభలో మన ఐక్యతను, సంఘీభావాన్ని చాలా నిర్ణయాత్మకంగా ప్రదర్శించాం. ఇప్పుడు మనం అదే స్ఫూర్తిని మరింత బలోపేతం చేసుకుని ముందుకు సాగాలి. తద్వారా మోదీ ప్రభుత్వ దుష్పరిపాలన కారణంగా దేశం ఎదుర్కొంటున్న అనేక రాజకీయ, ఆర్థిక, సామాజిక, విదేశాంగ విధాన సవాళ్లను మనం ఎదుర్కోగలుగుతాం" అని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి సమావేశం కావాలని కూటమి నిర్ణయించుకుంది. తదుపరి సమావేశం ఆగస్టు 8న హైదరాబాద్‌లో జరగనుంది.నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన నెల రోజుల తర్వాత ఇండియా కూటమి పార్టీలు సమావేశమయ్యాయి. ఇక, అసోం, పశ్చిమ్ బెంగాల్‌లో బీజేపీ, కేరళలో కాంగ్రెస్, తమిళనాడు విజయ్ పార్టీ విజయం సాధించాయి.

# హర్మూజ్ సమీపంలో భారతీయ నౌకపై దాడి

మొదటి పేజీ తరువాయి

భారతీయ సిబ్బందితో ఉన్న ఆయిల్ ట్యాంకర్‌పై సోమవారం దాడి చోటుచేసుకుంది. విదేశీ జెండా కలిగిన 'మారివెక్స్' అనే చమురు ట్యాంకర్‌లో 24 మంది భారతీ య నావికులు ఉన్నారని, కాల్పుల వల్ల అగ్నిప్రమాదం జరిగినట్లు ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం ఎక్స్ (ట్విట్టర్)లో పేర్కొంది. మడగాస్కర్ జెం డా కలిగిన ఈ నౌకలోఎలాంటి సరుకు లేదని, సిబ్బంది అందరూ సురక్షితంగా ఉన్నారని తెలిపింది. 'భారతీయ నావికులు ప్రయాణిస్తున్న ఒక నౌకకు సంబంధించిన సంఘటనపై మా మిషన్ దృష్టి సారించింది. వారి రక్షణ, భద్రత కోసం మేము ఒమన్ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాం' అని పోస్ట్ చేసింది. ఆ దాడితో ఇంజిన్ దెబ్బతిని మంటలు చెలరేగడంతో సిబ్బంది ఎస్ఓఎస్ కాల్ పంపినట్లు తెలిపింది. అయితే, ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం లేదని, సిబ్బంది అంతా సురక్షితంగా ఉన్నట్టు భారత నౌకాయాన శాఖ డైరెక్టర్ ఒపేష్ కుమార్ శర్మ ప్రకటించారు. 'భారతీయ నావికులందరూ ప్రస్తుతం సురక్షితంగా ఉన్నారు. వారి భద్రతను నిర్ధారించడానికి మేము విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, విదేశాల్లోని మన భారత రాయబార కార్యాలయాలు, భారత నౌకాదళం, రక్షణ మంత్రిత్వ శాఖతో సమన్వయం చేసుకుంటున్నాం' అని ఆయన అన్నారు. పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైన తర్వాత నుంచి ఇప్పటి వరకూ 3,506 మంది భారతీయ నావికులను సురక్షితంగా తీసుకొచ్చామని వివరించారు. గత 96 గంటల్లోనే 32 మంది నావికులను తీసుకొచ్చినట్టు తెలిపారు. అయితే, నౌకలోని పలువురు గాయపడ్డారని ఫార్వర్డ్ సీమెన్స్ యూనియన్ ఇండియా భిన్నమైన ప్రకటన చేసింది. ఈ ట్యాంకర్ భారత్‌లోని కర్వార్ పోర్టు నుంచి ఒమన్ దుక్మ్ రేవుకి వెళ్తున్నట్టు ట్రాకర్‌ను బట్టి తెలుస్తోంది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు, హర్మూజ్ జల సంధి సమీపంలోని చమురు బావులను టార్గెట్ చేయడంపై ఇరాన్ తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతోంది. ఈ క్రమంలోనే ఇజ్రాయెల్‌పై క్షిపణులు, యుద్ధ విమానాలతో దాడులు చేసింది.

# మహా నగరంలో పేదలకు లక్ష ఇళ్లు

మొదటి పేజీ తరువాయి

చేసిన సభలో సీఎం రేవంత్ కీలక ప్రసంగం చేశారు. సబర్మతి, గంగా, యమునా నదుల ప్రక్షాళనను మెచ్చుకునే వారు, మూసీ ప్రక్షాళనకు ఎందుకు సహకరించడం లేదని సీఎం ప్రశ్నించారు. తెలంగాణ నుంచి 8 మంది బీజేపీ ఎంపీలను పంపిస్తే మోదీ ప్రధాని అయ్యారు. కానీ ఆ ఎంపీలు రాష్ట్రానికి ఏం తీసుకొచ్చారు? నీటి పారుదల ప్రాజెక్టులకు నిధులు రాకుండా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అడ్డుపుల్ల వేస్తున్నారు. మూసీ ప్రక్షాళనకు నిధులు ఇప్పించాలని బీజేపీ ఎంపీలు మోదీని ఏనాడైనా అడిగారా? అని ఆయన నిలదీశారు. ఎన్నికలకు ఇంకా ఆరు నెలల సమయం ఉన్నప్పుడు రాజకీయాలు మాట్లాడుకుందామని, ఈ రెండేళ్లు కలిసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని సీఎం పిలుపునిచ్చారు.

### మూడు కార్పొరేషన్ల ఏర్పాటు అందుకే

ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న 1.34 కోట్ల మందికి మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు, పాలనాపరమైన సమన్వయం కోసమే హైదరాబాద్ పరిధిలో మూడు కార్పొరేషన్లను ఏర్పాటు చేశామని రేవంత్ రెడ్డి తెలిపారు. కార్పొరేట్ కంపెనీల కార్యాలయా లకు ఏమాత్రం తీసిపోని విధంగా కార్పొరేషన్ భవనాలను నిర్మిస్తామని స్పష్టం చేశారు. మియాపూర్లో ద్విముఖ వంతెన, రెండు అండ ర్పాస్లు, మియాపూర్ నుంచి ఆల్విన్ క్రాస్ రోడ్ వరకు ఐదు వరుసల ద్విముఖ పైవంతెనల నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు.

### ట్రాఫిక్, కాలుష్య సమస్యలు లేకుండా

దేశ ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్న ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు లాంటి మహానగరాల్లో కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. కాలుష్యం వల్ల ఢిల్లీలో ప్రధాని కార్యాలయాన్ని సైతం మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కానీ మన హైదరాబాద్ నివాసానికి ఎంతో అనుకూలంగా ఉంది. భవిష్యత్తులో మన నగరానికి అలాంటి సమస్యలు రాకుండా ఉండేందుకు నిపుణులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశాం అని ముఖ్యమంత్రి వివరించారు. విశ్వనగరంగా చెప్పుకుంటే సరిపోదని, అందుకు తగ్గట్లుగా అభివృద్ధి జరగాలని సీఎం స్పష్టం చేశారు. దీనికోసం మెట్రో రెండో దశ విస్తరణ చేపడుతున్నామన్నారు. రాయదుర్గం నుంచి నియోపాలిస్ వరకు మెట్రో రైలును విస్తరిస్తామని చెప్పారు. గాజులరామారంలో వంద ఎకరాల్లో అంతర్జాతీయ బస్ టెర్మినల్ నిర్మిస్తున్నట్లు ప్రకటించారు. నగరంలో లక్ష ఎల్ఐజీ, ఎంఐజీ ఇళ్లను నిర్మించి పేదల సొంతింటి కలను నెరవేరుస్తాం. ఎక్కడ ఉన్న వారికి అక్కడే ఇళ్లు నిర్మించి ఇస్తాం. ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి విడిపించి పేదల ఇళ్ల కోసం వినియోగిస్తాం. రాబోయే 24 నెలల పాటు రోజుకు 18 గంటలు కష్టపడి రాష్ట్రంలోని అన్ని కీలక అభివృద్ధి పనులను పూర్తి చేస్తాం అని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

### గత ప్రభుత్వాల కృషి మరువలేం

ఆనాడు చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖరరెడ్డి వంటి వారు హైటెక్ సిటీ, ఔటర్ రింగ్ రోడ్ వంటి ప్రాజెక్టులను అభివృద్ధి చేయకపోయి ఉంటే, నేడు హైదరాబాద్ ఈ స్థాయికి చేరుకునేది కాదని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఇప్పుడు మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన, ఆర్ఆర్ఆర్ నిర్మాణం, పేదలకు ఇళ్లు, విద్య, వైద్య సేవల ద్వారా తెలంగాణను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# శ్వేత

## సంపాదకీయం

**మంగళవారం 9-6-2026**

# విద్యాసంస్థల్లో మాదక ద్రవ్యాలపై నిఘా!

ఇటీవలి కాలంలో మాదక ద్రవ్యాల పట్టివేత ఆందోళన కలిగిస్తోంది. ఎక్కడికక్క నిత్యం ఎక్కో ఓ చోట మాదక ద్రవ్యాలు పట్టుబడుతూనే ఉన్నాయి. ఉమమడి తెలుగు రాష్ట్రాల్లో గంజాయి విపరీతంగా సరఫరా అవుతోంది. ఈగిల్ టీమ్‌లు పనిచేస్తున్నా, డ్రగ్స్ సరఫరా ఆగడం లేదు. చాపకింద నీరులా డ్రగ్స్ రవాణా సాగుతుతోంది. కాలేజీలు, స్కూళ్లు తెరుస్తున్న వేళ ప్రభుత్వాలు అప్పమత్తం కావాలి. మాదక ద్రవ్యాలు చిన్నారులను చిదిమేయకుండా చూడాలి. తల్లిదండ్రులు కూడా పిల్లల కదలికలను గమనిస్తూ ఉండాలి. ఎవరు ఎవరితో వెళుతున్నారు..ఎక్కడికి అన్నది గుర్తించాలి. మాదక ద్రవ్యాల ముఠాలు విద్యార్థులను లక్ష్యంగా చేసుకని వ్యాపారాలు చేస్తున్నాయి. కఠినంగా వ్యవహరించకపోతే యువత తీవ్ర ప్రమాదంలో పడేలా ఉంది. పిల్లల ప్రవర్తనను, వారు ఎక్కడెక్కడి వెళుతున్నారన్నది తల్లిదండ్రుల నిరతంరం గమనించాలి. వారరు ఎవరి వలలో అయినా పడుతున్నారా అన్నది గుర్తించాలి. విద్యా సంస్థల్లో అవసరమైతే చెకింగ్స్ పెట్టాలి. ఈ రకంగా పిల్లలపై దుష్ప్రభావం చూపకుండా చేయాలి. మాదక ద్రవ్యాల ముఠాలు ఇప్పటికే ఐటి రంగాన్ని, సినిమా రంగాన్ని కేడా ప్రభావితం చేస్తున్నాయి. డ్రగ్స్ పార్టీలు కలకలం రేపుతున్నాయి. ఫామ్‌హౌజ్ పార్టీల్లో డ్రగ్స్ వాడకం పెరిగింది. ఇటీవల పలు కేసుల్లో ఇది నిరూపితం అయ్యింది. ఇతర దేశాలతో పోల్చితే భారతదేశంలో మాదకద్రవ్యాల వినియోగం తక్కువగా ఉంది. అయితే ప్రపంచ వ్యాప్తంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణాలో భారత్ క్రమేణా కీలక పాత్ర వహిస్తోంది. సహజంగానే ఇది ఆందోళన కలిగించే అంశం. విశ్వవ్యాప్తంగా ఉత్పత్తి అవుతోన్న హెరాయిన్‌లో 95శాతం థాయిలాండ్, బర్మా, ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్థాన్ లలోనే ఉత్పత్తి అవుతోంది. ఈ దేశాల మధ్య ఉన్న భారత్‌కు మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడం కత్తి మీద సాముగా ఉంది. మాదక ద్రవ్యాల అక్రమరవాణాకు భౌగోళికంగా భారత్ అనువుగా ఉంది. దీంతో అంతర్జాతీయ ముఠాలు భారత్‌పై కన్నేసి ఉంచాయి. భారత్ నుంచి విదేశాలకు నిత్యం రాకపోకలు సాగించే ప్రవాసులను పావులుగా వాడుకోవడానికి ఆ మాఫియా ముఠాలు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నాయి. మాదక ద్రవ్యాలన్నింటిలోనూ ఖరీదైన హెరాయిన్‌ను భారతదేశంలో ప్రతి రోజు సగటున 28 లక్షల మంది ఒక టన్ను మేరకు వినియోగిస్తున్నట్టు ఒక సర్వేలో వెల్లడయింది. కేంద్ర ప్రభుత్వమే స్వయంగా ఈ విషయాన్ని తెలిపింది.

దీన్ని బట్టి మాదక ద్రవ్యాల వినియోగం ఎంతగా పెరిగిపోయిందో అర్థం చేసుకోవచ్చు. ఒక్క హెరాయిన్ ద్వారా భారత్‌లోకి ప్రతి సంవత్సరం 1.44 లక్షల కోట్ల రూపాయల సొమ్ము మనీలాండరింగ్ ద్వారా వస్తుందని కూడా కేంద్రప్రభుత్వ అధ్వర్యంలోని జాతీయ మాదక ద్రవ్యాల నియంత్రణ సంస్థ అంచనా వేసింది. ఆరంభంలోనే ఈ అక్రమాన్ని నిర్మూలించడానికి సమగ్ర చర్యలు తీసుకోకపోతే తెలుగు రాష్ట్రాల, పంజాబ్‌కు తేడా లేకుండాపోతుంది. మరీ ముఖ్యంగా స్కూళ్లు, కాలేజీలు లక్ష్యంగా ముఠాలు పనిచేస్తున్నట్లు ఇటీవల గుర్తించారు. పిల్లు మాదక ద్రవ్యాలకు బానిసలైతే వారిని దారిలోకి తీసుకుని రావడం కష్టం. అందువల్ల ఈ ముఠాల మూలాలను కనుగొని వాటిని నిర్మూలించాల్సి ఉంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రవాసులతో పాటుగా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రవాసుల ద్వారా వారికే తెలియకుండా మాదక ద్రవ్యాలను విదేశాలకు సరఫరా చేస్తున్నట్లుగా ఇప్పటి వరకు బహిర్గతమైన కేసుల ద్వారా తెలుస్తోంది. గల్ఫ్ దేశాల్లో మాదక ద్రవ్యాల రవానా, సేవనం పై కఠిన ఆంక్షలు ఉన్నాయి.

అక్కడ చాలామంది కఠిన శిక్షలకు గురవుతున్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నేరంపై గల్ఫ్ దేశాలలో ముఖ్యంగా కువైత్‌లో ఆంధప్రదేశ్ ప్రవాసులు అధిక సంఖ్యలో జైళ్ళలో మగ్గుతున్నారు. కువైత్ కేంద్ర కారాగారంలో మాదక ద్రవ్యాలకు సంబంధించిన నేరాలపై శిక్ష అనుభవిస్తున్న భారతీయ ఖైదీలలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారే అత్యధికంగా ఉన్నారు. హెరాయిన్ కంటే స్వల్ప ప్రభావం కలిగిన ఔషధ మందులు, గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడ్డ వారు యు.ఏ.ఇ., ఖతర్ తదితర దేశాలలోని జైళ్ళలో మగ్గుతున్నారు. దురదృష్టవశాత్తు వీరి నేరాల విషయమై స్వదేశంలోని పోలీసులు లోతుగా విచారణ చేయలేకపోతున్నారు. కొన్ని కేసులలో దర్యాప్తునకు సహకరించడానికి కుటుంబ సభ్యులు ముందుకు రావడం లేదు. మరి కొన్ని కేసులలో స్మగ్లింగ్ ముఠాలు గల్ఫ్ జైళ్ళలో మగ్గుతున్న వారి కుటుంబ సభ్యులకు నెలకు కొంత మొత్తం పారితోషికం ఇస్తున్నారు. దీంతో సంబంధిత ఖైదీల కుటుంబాలు కూడా దర్యాప్తునకు సహకరించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. విదేశాలకు అక్రమ రవాణా అటుంచి స్వదేశంలోనూ మాదక ద్రవ్యాల వినియోగం పెరిగిపోతోంది. హైదరాబాద్‌తో సహా దేశవ్యాప్తంగా పలు నగరాలలో యువతీయువకులు మాదక ద్రవ్యాల వ్యసనానికి గురవుతున్నారు. గల్ఫ్‌లో పుట్టిపెరిగిన కొంత మంది పిల్లలను వారి తల్లిదండ్రులు ఉన్నత విద్యాభ్యాసానికై హైదరాబాద్‌కు పంపించడానికి డ్రగ్స్ కారణంగా భయపడుతున్నారు. ఈ క్రమంలో స్కూళ్లు, కాలేజీల్లో నిఘా పెంచాలి. పిల్లలు ఎవరితో వెళుతున్నారో గుర్తించాలి. కాలేజీలు, స్కూళ్ల పరిసరాల్లో సిసి కెమెరాలను పెంచాలి. దీంతో పిల్లల యోగక్షేమాలకు కూడా అవకాశం ఏర్పడుతుంది. దేశంలో యువతను డ్రగ్స్ మహమ్మారి నుంచి కాపడే యత్నం చేయాలి. డ్రగ్స్ రవాణాపై మరింత కఠనంగా వ్యవహరిస్తే తప్ప ఇది సాధ్యం కాదు.



# భూ రికార్డులు క్లీన్!

మొదటి పేజీ తరువాయి

విషయంలో తీవ్రమైన కల్లోలం సృష్టించిందని, పశ్చిమ గోదావరి లాంటి పచ్చని ప్రాంతాల్లోనూ భూ చిచ్చు పెట్టిందని చంద్రబాబు ఆక్షేపించారు. ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన భూ రికార్డులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే కుట్రలు చేశారని మండిపడ్డారు. ప్రజల ఆస్తి పత్రాలపై గత సీఎం తన ఫోటోలు ముద్రించుకున్నారని, సరిహద్దు రాళ్లపై బొమ్మల కోసం ఏకంగా రూ. 800 కోట్లు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రౌడీ చట్టంగా మారిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేసి ప్రజల యాజమాన్య హక్కులను కాపాడామని గుర్తుచేశారు. ఇప్పుడు ఇస్తున్న పాస్ పుస్తకాలకు కరెన్సీ నోట్ల తరహాలోనే అత్యంత పటిష్టమైన భద్రతా ఫీచర్లు, క్యూఆర్ కోడ్, అధికారిక రాజముద్రను పొందుపరిచామని వివరించారు. రైతుల ఈ-కేవైసీ పూర్తయిన తర్వాతే పారదర్శకంగా వీటిని ముద్రిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో భూ పరిపాలనను సులభతరం చేసేందుకు రెవెన్యూ శాఖలో సమూల మార్పులు తెచ్చామని, ఇందులో భాగంగా 'రీ-సర్వే 2.0' వేగంగా సాగుతోందని సీఎం వెల్లడించారు. ఇప్పటికే 6,688 గ్రామాల్లో రీ-సర్వే పూర్తి చేసి భూ రికార్డులను అప్‌డేట్ చేశామని, 26.46 లక్షల మందికి పాస్ పుస్తకాలు ఇచ్చామని తెలిపారు. వచ్చే 9 నెలల్లో మరో 10,357 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి 67.32 లక్షల పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. 1,836 గ్రామాల్లో ఇప్పటికే తుది 'రికార్డ్ ఆఫ్ రైట్స్' సిద్ధమైందన్నారు. విక్రయం, బహుమతి, విభజన వంటి 9 లక్షల భూ లావాదేవీలకు సంబంధించి 100 శాతం ఆటో మ్యుటేషన్ విధానాన్ని తీసుకువచ్చామని, వాట్సాప్ ద్వారా మ్యుటేషన్ దరఖాస్తు, ట్రాకింగ్ సౌకర్యం కల్పించామని చెప్పారు. వారసత్వ ఆస్తుల బదిలీని సులభతరం చేస్తూ రూ. 10 లక్షల లోపు విలువైన ఆస్తుల బదిలీని కేవలం రూ. 100 లకే పరిమితం చేశామన్నారు. దశాబ్దాలుగా నిషేధిత జాబితాలో ఉన్న 1.37 లక్షల ఎకరాల విలేజ్ సర్వీస్ ఇనామ్ భూములకు విముక్తి కల్పించడంతో పాటు, తిరుపతి జిల్లాలోని వివాదాస్పద శెట్టిపల్లి భూముల సమస్యను పరిష్కరించి బాధితులకు అప్పగించామని వివరించారు.

పశ్చిమ గోదావరి జిల్లా ఆర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మలైన ఆక్వా, వ్యవసాయ రంగాలకు కూటమి ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని సీఎం హామీ ఇచ్చారు. ఆక్వా జోన్ పరిధిలోని చెరువులకు యూనిట్ విద్యుత్‌ను రూ. 1.50 లకే అందిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆక్వా ఫీడ్ ధరలు పెరిగి రైతులు ఇబ్బందుల్లో ఉన్నారని, అందువల్ల సోయాబీన్ మీల్ దిగుమతులపై సుంకాలను తగ్గించి రాయితీలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని తెలిపారు. గోదావరి జిల్లాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఆక్వా పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలు కాలుష్య కారకాలుగా మారకుండా, వాటి ద్వారా 'న్యూట్రాసిటికల్' ఔషధాలను తయారు చేసే సరికొత్త సాంకేతిక అవకాశాలను ప్రోత్సహిస్తామన్నారు. కూటమి ప్రజా ప్రభుత్వం రెండేళ్ల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకుందని.. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనలను సమపాళ్లలో అందిస్తున్నామని ముఖ్యమంత్రి సగర్వంగా ప్రకటించారు. ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తిరుపతి, అమరావతి, విశాఖపట్నంలో మూడు భారీ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పడిపోయిన అభివృద్ధిని మళ్లీ ట్రాక్‌లోకి తెచ్చామని, పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన వేగంగా జరుగుతోందని చెప్పారు. సూపర్ సిక్స్ హామీల్లో చెప్పిన వాటికంటే అదనంగా ప్రజలకు లబ్ధి చేకూరుస్తున్నామని.. పెన్షన్లు, తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, ఆటో డ్రైవర్లు, మత్స్యకారుల సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని వివరించారు.

వైసీపీపై సీఎం చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గొడ్డలి పార్టీగా అభివర్ణిస్తూ.. గొడ్డలి పట్టే చేతులకు నాగలి పట్టే రైతులు ఎలా గుర్తుంటారు? కోడికత్తి డ్రామాలు ఆడేవారికి వరికోతలు ఎలా తెలుస్తాయి? గంజాయి బ్యాచ్‌లను ఓదార్చే వారికి పంటల సాగు కష్టాలు ఏం తెలుస్తాయి? అంటూ ఎద్దేవా చేశారు. డీఎస్సీ ద్వారా రికార్డు స్థాయిలో 16 వేల మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పిస్తే, పరీక్షల విధానంపై కనీస అవగాహన లేని ఆ పార్టీ నేతలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో జాబ్ క్యాలెండర్ పేరిట నిరుద్యోగులను దగా చేసిన వైసీపీ.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఉద్యోగాలిస్తుంటే ఓర్వలేక దుష్ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు, రాష్ట్ర ప్రజలకు ఆ పార్టీ తక్షణమే క్షమాపణ చెప్పాలని, క్షమాపణ కోరనిదే వారికి రాష్ట్రంలో రాజకీయం చేసే అర్హతే లేదని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి వెళ్లి అక్కడి ఎమ్మార్వో, జేసీ సంతకాలను ఫోర్జరీ చేసి రూ. 1500 కోట్ల భూ అక్రమాలకు పాల్పడ్డారంటూ వైసీపీ నేతలపై ఆరోపణలు చేశారు. ఇంత పెద్ద నేరంలో వినుకొండ మాజీ ఎమ్మెల్యే పాత్ర ఉన్నా, ఆ పార్టీ అధ్యక్షుడు ఆయనపై ఎందుకు చర్యలు తీసుకోలేదని చంద్రబాబు ప్రశ్నించారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే ఇలాంటి క్రిమినల్ శక్తులను ప్రజలు దూరంగా పెట్టాలని పిలుపునిచ్చారు.

ప్రజల ఆరోగ్యం, సంతోషమే లక్ష్యంగా ప్రభుత్వం సరికొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోందని సీఎం తెలిపారు. రాబోయే ఆగస్టు 15 నాటికి రాష్ట్రవ్యాప్తంగా సంజీవని డిజిటల్ హెల్త్ రికార్డుల విధానాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తామన్నారు. ప్రివెంటివ్, ప్రిడిక్టివ్,క్యూరేటివ్ విధానంలో ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమన్నారు. త్వరలోనే రాష్ట్రంలో పర్యావరణ హిత ఎలక్ట్రిక్ ఆర్‌టీసీ బస్సులను ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించారు.

మృగశిర కార్తెను పురస్కరించుకుని ప్రజలంతా ఆరోగ్యకరమైన చేపల ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అలాగే శారీరక, మానసిక ఆరోగ్యం కోసం జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఒక కోటి మందితో యోగాంధ్ర కార్యక్రమాన్ని బృహత్తరంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అత్యంత సంపన్నమైన, ఆనందకరమైన, ఆరోగ్యకరమైన రాష్ట్రంగా మార్చడమే తమ అంతిమ సంకల్పమని చంద్రబాబు పునరుద్ఘాటించారు.సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ ప్రదర్శన స్టాళ్లను ముఖ్యమంత్రి ఆసక్తిగా సందర్శించారు. పశ్చిమ గోదావరి జిల్లా ప్రత్యేకత అయిన కోకోతో తయారైన చాక్లెట్లు, కొబ్బరి, పామాయిల్ ఉత్పత్తులను పరిశీలించారు. అలాగే పర్యావరణ హితంగా వరి ఊక, గడ్డితో తయారు చేసిన ఉత్పత్తులను, గుర్రపు డెక్క ద్వారా తయారు చేసిన వర్మీ కంపోస్ట్ ఎరువును, ఆక్వా వ్యర్థాల నుంచి సృష్టించిన ఉప ఉత్పత్తులను సీఎం పరిశీలించి, ఆయా తయారీదారులను, పారిశ్రామికవేత్తలను ప్రత్యేకంగా అభినందించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు మరియు వేలాదిగా తరలివచ్చిన రైతులు, ప్రజలు పాల్గొన్నారు.



# తెలంగాణను తాకిన రుతుపవనాలు

మొదటి పేజీ తరువాయి

విస్తరించాయి. కాగా, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఆదివారం విడుదల చేసిన బులెటిన్‌లో రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం వరకు విస్తరించాయని, ప్రస్తుతం తెలంగాణ దక్షిణ సరిహద్దులోకి ప్రవేశించే స్థితిలో ఉన్నాయని తెలిపింది. చెప్పినట్లే ఇవాళ తెలంగాణలోకి ప్రవేశించాయి. 'పరిస్థితులు అనుకూలంగా ఉంటే.. రుతుపవనాలు తెలంగాణ వ్యాప్తంగా విస్తరించడానికి కేవలం 2 నుంచి 3 రోజులు చాలు' అని అధికారులు తెలిపారు. అటు.. దక్షిణ, తూర్పు తెలంగాణ జిల్లాలకు భారీ వర్ష సూచన జారీ చేశారు. తెలంగాణలోని రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, రంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులు, ఉరుములతో కూడిన బలమైన గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

## దక్షిణాది రాష్ట్రాల్లో విస్తరిస్తున్న నైరుతి రుతుపవనాలు.. పలుచోట్ల భారీ వర్షాలు

**హైదరాబాద్, జూన్ 8 :**
దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు క్రమంగా విస్తరిస్తుండటంతో దక్షిణాది రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. కేరళలో ప్రవేశించిన రుతుపవనాలు కర్ణాటక, గోవా, తమిళనాడు ప్రాంతాలకు వేగంగా విస్తరించగా, త్వరలోనే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాలను కూడా పూర్తిగా ఆవరించే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రుతుపవనాల ప్రభావంతో కేరళ, కర్ణాటక, గోవా రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో వరదలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా రానున్న రోజుల్లో వర్షపాతం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. రైతులు ఖరీఫ్ సాగు పనులకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఈ వర్షాలు వ్యవసాయ రంగానికి ఊరటనివ్వనున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు, ముఖ్యంగా వ్యవసాయ రంగానికి నైరుతి రుతుపవనాలు కీలకమైనవిగా భావిస్తారు. వార్షిక వర్షపాతంలో అధిక భాగం ఈ రుతుపవనాల ద్వారానే లభిస్తుండటంతో రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని, వాతావరణ శాఖ సూచనలను ఎప్పటికప్పుడు గమనించాలని అధికారులు సూచించారు.

## కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి: బీఏఐ

**నల్లగొండ, జూన్ 08 :**
రాష్ట్రంలో గత మూడేళ్లుగా వివిధ శాఖల పరిధిలో పూర్తి చేసిన పనులకు సంబంధించి సుమారు రూ.20 వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని ప్రభుత్వం వెంటనే చెల్లించాలని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా **(BAI)** నేతలు డిమాండ్ చేశారు. సోమవారం నల్లగొండలో నిర్వహించిన మీడియా సమావేశంలో బీఏఐ మాజీ అధ్యక్షుడు ఎస్.ఎన్.రెడ్డి, ఉపాధ్యక్షుడు డీవీఎన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వానికి, కాంట్రాక్టర్లకు మధ్య వారధిగా ఉండే బీఏఐ విజ్ఞప్తులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా ఈ క్రింది అంశాలను వారు లేవనెత్తారు:

సీరియల్ పద్ధతిలో చెల్లింపులు: గతంలో అమల్లో ఉన్న 'ఫస్ట్ కమ్-ఫస్ట్ సర్వ్' పద్ధతిని తొలగించి, ప్రస్తుతం ఇష్టానుసారంగా బిల్లులు విడుదల చేస్తున్నారని, దీనివల్ల చిన్న కాంట్రాక్టర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని వారు పేర్కొన్నారు. పెండింగ్ బిల్లులను సీరియల్ ప్రకారం (సీనియారిటీ ప్రాతిపదికన) చెల్లించాలని కోరారు.

కాంట్రాక్టర్ల ఆత్మహత్యలు: బిల్లులు సకాలంలో అందక, అప్పుల పాలై ఎంతోమంది కాంట్రాక్టర్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, నాగర్‌కర్నూల్‌కు చెందిన శ్రీనివాసరెడ్డి ఉదంతాన్ని వారు గుర్తు చేశారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం: 98 శాతం మంది కాంట్రాక్టర్లు తమ ఆస్తులను తాకట్టు పెట్టి ప్రభుత్వ పనులు పూర్తి చేశారని, కానీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని వారు మండిపడ్డారు. ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ కోసం ఎన్నిసార్లు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయిందని తెలిపారు.

చలో హైదరాబాద్: ప్రభుత్వం బిల్లుల విషయంలో మొండి వైఖరిని వీడకపోతే, ఈ నెల 18న నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమం ద్వారా తమ నిరసనను తెలియజేస్తామని, భవిష్యత్తులో కఠిన నిర్ణయాలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ఉన్న నిధులను పారదర్శకంగా సీనియారిటీ ప్రకారం కాంట్రాక్టర్లకు విడుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో బీఏఐ నేతలు సీహెచ్.శ్రీనివాసరావు, సంతోష్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఎస్.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్న ఫెర్టిలైజర్ యాప్: మంత్రి తుమ్మల

**హైదరాబాద్, జూన్ 8 :**
తెలంగాణ ప్రభుత్వం రైతుల కోసం రూపొందించిన ఫెర్టిలైజర్ మానిటరింగ్ యాప్ దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. ఎరువుల సరఫరాలో పారదర్శకత, అందుబాటు మరియు పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ యాప్ కీలకంగా ఉపయోగపడుతోందని ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రంలో రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మంత్రి చెప్పారు. ఎరువుల నిల్వలు, పంపిణీ, విక్రయాలపై ఎప్పటికప్పుడు సమాచారం అందుబాటులో ఉండటంతో అధికారులు వేగంగా స్పందించే అవకాశం కలుగుతోందని వివరించారు. ఈ యాప్ ద్వారా ఎరువుల కొరత, అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నాలను సమర్థంగా నియంత్రించగలుగుతున్నామని మంత్రి తెలిపారు. రైతులకు అవసరమైన సమాచారం సాంకేతిక పరిజ్ఞానం ద్వారా చేరవేయడంలో తెలంగాణ ప్రభుత్వం ముందంజలో ఉందని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో డిజిటల్ సాంకేతికత వినియోగాన్ని ప్రోత్సహిస్తూ రైతులకు మరింత మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎరువుల లభ్యతపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని, రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# జూలై 5న భువనగిరిలో 'రాజ్యాధికార సమరభేరి'

### విజయవంతానికి అహర్నిశలు కృషి చేయాలి: మాధం రజిని కుమార్ యాదవ్



**హన్మకొండ, జూన్ 8:**
తెలంగాణ రాజ్యాధికార పార్టీ జనగామ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం హన్మకొండలోని పార్టీ ప్రాంతీయ కార్యాలయంలో ఘనంగా జరిగింది. జిల్లా అధ్యక్షులు కట్ల సదానందం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాధం రజిని కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం మరియు భవిష్యత్ కార్యాచరణపై నాయకులకు దిశానిర్దేశం చేశారు.

**"రాజ్యాధికార సమరభేరి" లక్ష్యంగా..**

వచ్చే జూలై 5న భువనగిరిలో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో జరగనున్న "రాజ్యాధికార సమరభేరి" భారీ బహిరంగ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని రజిని కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. ఈ సభ బహుజన వర్గాల రాజ్యాధికార సాధనకు ఒక మైలురాయిగా నిలవాలని ఆకాంక్షించారు.

**ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ:**

10 వేల మంది సమీకరణ: జనగామ జిల్లా నుంచి కనీసం 10 వేల మందిని సభకు తరలించేలా ప్రతి నాయకుడు, కార్యకర్త నేటి నుంచే అహర్నిశలు శ్రమించాలని ఆదేశించారు. ప్రచార ఉధృతి: గ్రామాలు, మండలాలు, పట్టణాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తూ పార్టీ సందేశాన్ని ప్రతి గడపకూ తీసుకెళ్లాలని సూచించారు. సామాజిక న్యాయం: తెలంగాణలో రాజకీయ సమానత్వం, బహుజన వర్గాల రాజ్యాధికారం సాధనే ధ్యేయంగా సాగుతున్న ఈ పోరాటంలో ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు.

జిల్లా స్థాయిలో పార్టీని మరింత పటిష్టం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేసే క్రమంలో పలువురు నాయకులకు బాధ్యతలు అప్పగించారు. పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తేనే ఆశయాలు ప్రజల్లోకి బలంగా వెళ్తాయని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు పోలు రాజు, పూజారి సత్యనారాయణ, వావీ సౌత్ ఇంచార్జి మార్త శ్రీనివాస్, జిల్లా నాయకులు దిలీప్, బబ్లు, జమీల్, సతీష్, నరేష్, విష్ణు, అంజాద్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు లాభసాటి పంటలపై అవగాహన కల్పించాలి

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట జూన్ 8**
తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకే 'ప్రజా పాలన ప్రగతి నివేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. సూర్యాపేట మండలం రామన్నగూడెం గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూప్రభుత్వం విద్యా, వైద్యం, వ్యవసాయం, సంక్షేమ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించిందని, ఇందులో భాగంగానే 99 రోజుల పాటు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజా పాలనలో భాగంగా అధికారులు నేరుగా ప్రజల వద్దకే వెళ్లి, వారి సమస్యలను తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కరిస్తారని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేరాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు.

**వరికి ప్రత్యామ్నాయంగా లాభసాటి పంటలు**

ప్రస్తుత సీజన్‌లో మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులు సాంప్రదాయ వరి సాగుకు ప్రత్యామ్నాయంగా లాభసాటిగా ఉండే ఇతర పంటలపై దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. రానున్న వర్షాకాలంలో ఎల్నీనో ప్రభావం కారణంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరించిందని గుర్తుచేశారు. వర్షాలు సకాలంలో పడకపోతే, వరి పంట చేతికొచ్చే సమయానికి ఆశించిన దిగుబడి రాక రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ నష్టాలను నివారించేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా.. విడతల వారీగా ఎలాంటి ప్రత్యామ్నాయ పంటలు వేస్తే లాభదాయకంగా ఉంటుందో వ్యవసాయ అధికారులు రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తారని కలెక్టర్ తెలిపారు. ఓటర్ జాబితాలో పేరు నమోదు కోసం తమ ఇళ్లకు వచ్చే బీఎల్ఓల దగ్గర ఎన్యుమరేషన్ ఫామ్ పూర్తి చేసి అందించాలని కోరారు. అలాగే, పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే వారికి నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్యం అందడం ఎంతో కీలకమని, ఆ దిశగా తల్లిదండ్రులు, అధికారులు కృషి చేయాలన్నారు. రాబోయే రోజుల్లో రామన్నగూడెం గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందంజలో ఉంచి, ఒక ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

**ఈ నెల 25 లోపు బిల్లులు సమర్పించాలి**

గ్రామంలోని వార్డుల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను ఈ నెల 25వ తేదీ లోపు సబ్మిట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి, ఎంపీడీవో బాలకృష్ణ, ఇతర అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## హైడ్రా సంచలనం

### రూ.లక్ష కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ భూముల రక్షణ!

**హైదరాబాద్, జూన్ 8 :**
హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ **(HYDRAA)** తన కార్యకలాపాలతో మరో కీలక మైలురాయిని చేరుకుంది. ప్రభుత్వ భూములను, చెరువులను కబ్జాకోరుల నుంచి కాపాడటంలో హైడ్రా విజయవంతంగా ముందుకు సాగుతోంది. తాజాగా చేపట్టిన ఆపరేషన్లతో ఇప్పటివరకు హైడ్రా రక్షించిన ప్రభుత్వ ఆస్తుల విలువ రూ. లక్ష కోట్లకు పైగా చేరిందని అధికారిక వర్గాలు వెల్లడించాయి.



**ప్రధానాంశాలు:**

భారీ ఆపరేషన్: ఇటీవల రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం, పుప్పాలగూడ-ఖాజాగూడ ప్రాంతాల్లో సుమారు 200 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు రక్షించారు. దీని విలువ మార్కెట్ ధర ప్రకారం సుమారు రూ. 30,000 కోట్లు ఉంటుందని అంచనా.

**చారిత్రక వారసత్వం:**

ఈ ప్రాంతంలో 250 కోట్ల సంవత్సరాల నాటి చారిత్రక రాతి గుట్టలు, రాతి గుహలు ఉన్నాయి. పర్యావరణ పరిరక్షణలో భాగంగా, 'సొసైటీ టు సేవ్ రాక్స్' సంస్థ విజ్ఞప్తి మేరకు, హైకోర్టు ఆదేశాల ప్రకారం ఈ భూమిని హైడ్రా కబ్జా నుంచి కాపాడింది.

**నిరంతర పోరాటం:**

జూలై 2024లో హైడ్రా ఏర్పాటు అయినప్పటి నుండి, నగరవ్యాప్తంగా అక్రమ కట్టడాలను తొలగించడం, చెరువుల ఎఫ్‌టీఎల్ (ఫ్లూ) పరిధిని కాపాడటం మరియు ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవడంలో హైడ్రా కీలక పాత్ర పోషిస్తోంది.

**రాష్ట్రవ్యాప్త విస్తరణ:**

హైడ్రా పనితీరుపై ప్రజల నుంచి వస్తున్న స్పందన దృష్ట్యా, దీని కార్యకలాపాలను తెలంగాణ అంతటా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడి:**

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ, ప్రభుత్వ భూములను, పర్యావరణ సంపదను భావి తరాల కోసం కాపాడటమే తమ ఏజెన్సీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. అక్రమార్కుల నుంచి వేలాది ఎకరాల భూమిని ప్రభుత్వం తిరిగి తన అధీనంలోకి తీసుకుందని, ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ చర్యల పట్ల పర్యావరణ ప్రేమికులు మరియు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## బీసీ నేత ఎదుగుదల ఓర్వలేకే చెంగిచెర్లలో టీఆర్పీ నేతపై దాడి

**నేతపై దాడినీ.. తీవ్రంగా ఖండించిన: పార్టీ రాష్ట్ర నాయకత్వం.**

**ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీఆర్పీ నేతను పరామర్శించిన:పార్టీ రాష్ట్ర నాయకులు**



**హైదరాబాద్, జూన్ 8 :**
తెలంగాణ రాజ్యాధికార పార్టీ చెంగిచెర్ల 12వ డివిజన్ అధ్యక్షుడి శరత్ పై జరిగిన ప్రాణాంతక దాడిని పార్టీ రాష్ట్ర నాయకత్వం తీవ్రస్థాయిలో ఖండించింది. రాజకీయంగా ఎదుగుతున్న ఒక బీసీ బిడ్డ చెంగిచెర్లలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ సభ పెట్టడంతో సభకు పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న రాకతో సభ సక్సెస్ కావడంతో జీర్ణించుకోలేక, రాజకీయ కక్షతో ఒక రెడ్డి వర్గానికి చెందిన నాయకుడు కత్తులతో ఈ ఘాతుకానికి ఒడిగట్టడం దారుణమని మండిపడ్డారు. ఈ దారుణ ఉదంతంపై పార్టీ అధినేత తీన్మార్ మల్లన్న గారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బడుగు, బలహీన వర్గాల నాయకత్వాన్ని అణచివేయాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అధినేత పిలుపు మేరకు పార్టీ రాష్ట్ర ముఖ్య నాయకులు తక్షణమే ఆసుపత్రికి చేరుకున్నారు. అక్కడ చికిత్స పొందుతున్న చెంగిచెర్ల అధ్యక్షుడి శరత్ ని పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ ఆయనకు మరియు ఆయన కుటుంబానికి పూర్తి అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. రాజకీయాల్లో బీసీ బిడ్డలు రాణించడం సహించలేకనే ఈ కత్తుల సంస్కృతిని తెరపైకి తెచ్చారని, ఇలాంటి పిరికిపంద దాడులతో తమను భయపెట్టలేరని నాయకులు స్పష్టం చేశారు. దాడికి పాల్పడిన సదరు నాయకుడిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. బాధితుడికి పూర్తి న్యాయం జరిగే వరకు చట్టపరంగా, రాజకీయంగా పోరాటం చేస్తామని తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకత్వం హెచ్చరించింది.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేములవాడ మదన్ మోహన్ చారి,రాష్ట్ర కార్యదర్శి శివవీర్ రెడ్డి, మహబూబ్నగర్ జిల్లా అధ్యక్షులు జైపాల్ రెడ్డి, స్టేట్ ఆఫీస్ కో ఆర్డినేటర్ లింగం యాదవ్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి మహేష్, కార్యకర్తల పాల్గొన్నారు



# జనం కోసమే ప్రజావాణి

**ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి**

**ప్రజావాణి దరఖాస్తులు 77**

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట జూన్ 9**

ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మరియు డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. అధికారులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. డివిజన్ స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి సంబంధించి 43 దరఖాస్తులు, డిడబ్ల్యుఓ 4, డీపీఓ 3, మున్సిపాలిటీ 3 మిగిలిన 24 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని మొత్తం 77 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్భంగా అన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్డిఓ పి డి సన్యాసయ, డిఎంహెచ్ఓ వెంకటరమణ, పిడి హౌసింగ్ సిద్ధార్థ్, సిపిఓ కిషన్ నాయక్, డి ఏ ఓ శ్రీధర్ రెడ్డి, డిఇఓ అశోక్ , స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు ఇతర జిల్లా అధికారులు తదితరులు హాజరైనారు



# కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

**సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**

**సూర్యాపేట, జూన్ 8 ::**

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, సిపిఐ శ్రేణులు రాజీలేని పోరాటానికి సిద్ధం కావాలని ఆ పార్టీ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో జరిగిన సిపిఐ జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచుతూ కేంద్రం సామాన్యుల నడ్డి విరుస్తోంది. గ్యాస్ ధర ఇప్పటికే రూ. 89, పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుకు రూ. 10 చొప్పున పెరిగాయి. వీటిని నియంత్రించకుండా దేశభక్తి పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 10న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ప్రజా సంఘాలతో కలిసి భారీ ధర్నాలు చేపడుతున్నట్లు తెలిపారు.

భవిష్యత్ కార్యాచరణ:

జూన్ 23, 24: సూర్యాపేటలో జిల్లా స్థాయి ముఖ్య నాయకులకు రాజకీయ శిక్షణ తరగతులు.

ఆగస్టు 6 నుండి 14 వరకు: రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్రలు.

సెప్టెంబర్ 28: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా 'చలో ఢిల్లీ' కార్యక్రమం.

ప్రజా సంఘాల జిల్లా మహాసభలు:

సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, జూన్, జూలై నెలల్లో అఖిల భారత యువజన సమాఖ్య **(AIYF)**, జాతీయ మహిళా సమాఖ్య **(NFIW)**, ఎఐఎస్ఎఫ్, గిరిజన సమాఖ్య, దళిత హక్కుల పోరాట సమితి తదితర అనుబంధ ప్రజా సంఘాల జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నెలాఖరులోగా సభ్యత్వ నమోదు ప్రక్రియ పూర్తి చేసి, శాఖ, మండల స్థాయి సమావేశాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశానికి పోకల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా, రాష్ట్ర సమితి సభ్యులు యల్లావుల రాములు, ధూళిపాళ ధనుంజయ నాయుడు, యల్లంల యాదగిరి, బద్దం కృష్ణారెడ్డి, గుండు వెంకటేశ్వర్లు, దేవవరం మల్లీశ్వరి, బూర వెంకటేశ్వర్లు, ఎస్.కె. సాయబెల్లి, అనంతుల మల్లీశ్వరి, ఖమ్మంపాటి రాము, కొండ కోటయ్య, రెమిడాల రాజు, ఉత్పతల కోటమ్మ, చిలకరాజు శ్రీను, ఏడెల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




# అర్హులందరికీ సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**సూర్యాపేట, జూన్ 8**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మీధి అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 35వ వార్డు చర్చి కాంపౌండ్‌లో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సూర్యాపేటను స్వచ్ఛతలో రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నిలిపేందుకు మున్సిపాలిటీ ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం డీఎస్పీ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ సూర్యాపేటను గంజాయి రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందన్నారు. పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని, ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ జ్యోతి కరుణాకర్, మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, కౌన్సిలర్ డాక్టర్ ఊర రామ్మూర్తి, బైరబోయిన శ్రీనివాస్, నాయకులు నిమ్మల వెంకన్న, టీఎంసీ శ్వేత, వార్డ్ ఆఫీసర్ ఉమా రాణి, మున్సిపాలిటీ మేనేజర్ ఎం బుచ్చిబాబు, ఆశ వర్కర్ ఎస్కే షబీనా సుల్తానా, ధనమ్మ, ఆర్పీ రోజా,వార్డు జవాన్ మల్లేష్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# చిలుకూరు గ్రామ సమస్యల పరిష్కారానికి అధికారుల దృష్టికి వినతి

**పీహెచ్‌సీ ప్రహరీ గోడ, నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణంపై చర్యలు కోరిన ప్రజాప్రతినిధులు**

**చిలుకూరు, జూన్8 :**

గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించాలనే లక్ష్యంతో చిలుకూరు మేజర్ గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధులు జిల్లా అధికారులను కలిసి పలు కీలక అంశాలను వారి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాభివృద్ధి, ప్రజా సౌకర్యాల మెరుగుదల, శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు సూర్యాపేట జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చిలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ప్రహరీ గోడ గత వర్షాకాలంలో కూలిపోయి ఇప్పటికీ పునర్నిర్మాణం జరగకపోవడంతో రోగులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ సమస్యను పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పరిష్కారం కాలేదని కలెక్టర్‌కు తెలియజేశారు. సమస్య తీవ్రతను గుర్తించిన జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్ఓ)కి అవసరమైన చర్యలు చేపట్టి పనులను తక్షణమే ప్రారంభించాలని ఆదేశించినట్లు గ్రామ ప్రతినిధులు తెలిపారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ నరసింహన్‌ను కలిసి గ్రామంలోని శాంతిభద్రతల పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా దశాబ్ద కాలంగా అసంపూర్తిగా ఉన్న చిలుకూరు నూతన పోలీస్ స్టేషన్ భవనం నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. పోలీస్ స్టేషన్ పూర్తయితే ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణమరింతబలోపేతం అవుతుందని ప్రతినిధులు పేర్కొన్నారు. గ్రామ ప్రజల సంక్షేమం, అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని గ్రామ ప్రజాప్రతినిధులు తెలిపారు. అధికారులు సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో చిలుకూరు సర్పంచ్ కొల్లు పుల్లమ్మ నాగయ్య, ఉప సర్పంచ్ బెల్లంకొండ నాగయ్య పాల్గొన్నారు.



# జూలై 5న 'రాజ్యాధికార సమరభేరి'ని విజయవంతం చేయాలి: బంధారపు నర్సయ్య గౌడ్

- **చౌటుప్పల్‌లో టీఆర్పీ కీలక సమావేశం: జన సమీకరణపై సుదీర్ఘ చర్చ..**
- **రాజ్యాధికార సాధన కోసం ప్రజలంతా కదిలిరావాలి: కొమరిశెట్టి నరసింహులు**
- **భువనగిరి మండల అధ్యక్షుడిగా బాలస్వామి నియామకం**

**చౌటుప్పల్ జూన్08: ::**

తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో జూలై 5వ తేదీన నిర్వహించ తలపెట్టిన "రాజ్యాధికార సమరభేరి" భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ కేంద్రంలో పార్టీ ముఖ్య నేతల కీలక సమావేశం ఏర్పాటు చేశారు పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఖమ్మం-రంగారెడ్డి జిల్లాల ఇన్‌చార్జి బంధారపు నర్సయ్య గౌడ్ ,సభ నిర్వాహకులు భువనగిరి జిల్లా అధ్యక్షులు కోమరిశెట్టి నరసింహులు,పిట్టల శంకర్ రాష్ట్ర నాయకులు ,వారు సభ ఏర్పాట్లు, జన సమీకరణ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ.. యాదాద్రి భువనగిరి జిల్లావ్యాప్తంగా ఉన్న 17 మండలాలు, 421 గ్రామాల్లోని ప్రతి కుల సంఘం అధ్యక్షునికి, కుల పెద్దలకు జూలై 5 సభ ఆహ్వాన పత్రికలను నేరుగా అందజేయనున్నట్లు తెలిపారు.రాజ్యాధికార సాధన కోసం ప్రజలందరూ ఈ సభకు భారీ ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు అలాగే భువనగిర పార్టీ బలోపేతంలో భాగంగా భువనగిరి మండల అధ్యక్షునిగా బాలస్వామిని నియమించినట్లు నేతలు ప్రకటించారు,అలాగే వలిగొండ, మోతుకూరు, గుండాల, బీబీనగర్, పోచంపల్లి మండల కమిటీల బలోపేతంపై ప్రత్యేకంగా చర్చించారు. 10వ తేదీన సన్నాహక సమావేశం సభ ఏర్పాట్లను క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు జూన్ 10న చౌటుప్పల్‌లో మరో కీలక సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో జిల్లాలోని ప్రతి గ్రామానికి ఒక ఇన్‌చార్జిని నియమించనున్నట్లు పార్టీ నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.




# ఏఐ రంగంలోకి రిలయన్స్ ఇన్ఫ్రా..
# షేరు అప్పర్ సర్క్యూట్

**ముంబై, జూన్ 8 ::**

రిలయన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అత్యాధునిక సాంకేతిక సేవల రంగంలోకి అడుగుపెడుతున్నట్లు ప్రకటించింది. పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకు చెందిన ఈ సంస్థ భవిష్యత్ సాంకేతిక అవకాశాలను దృష్టిలో ఉంచుకుని కొత్త వ్యాపార విస్తరణకు శ్రీకారం చుట్టింది.స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమర్పించిన వివరాల్లో భాగంగా కంపెనీ తన అనుబంధ సంస్థల ద్వారా ఏఐ సేవలు, డిజిటల్ టెక్నాలజీ ఆధారిత కార్యకలాపాలను చేపట్టనున్నట్లు వెల్లడించింది. ఈ ప్రణాళికలో భాగంగా మూడు అనుబంధ సంస్థల పేర్లను మార్చింది. వాటికి రిలయన్స్ ఏఐ వరల్డ్ ప్రైవేట్ లిమిటెడ్, రిలయన్స్ ఏఐ అపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, రిలయన్స్ ఏఐ వన్ ప్రైవేట్ లిమిటెడ్ అనే పేర్లు ఖరారు చేసింది.ఏఐ రంగ ప్రవేశ ప్రకటనతో పెట్టుబడిదారుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ వార్త వెలువడిన వెంటనే కంపెనీ షేరు బీఎస్ఈలో 5 శాతం పెరిగి రూ.86.17 వద్ద అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. గత ఏడాది కాలంలో షేరు విలువ గణనీయంగా తగ్గినప్పటికీ, ఇటీవల నెల రోజులుగా కోలుకుంటూ మంచి లాభాలను నమోదు చేస్తోంది.కంపెనీ ఆర్థిక ఫలితాలు కూడా ఆశాజనకంగా ఉన్నాయి. 2026 మార్చితో ముగిసిన త్రైమాసికంలో రిలయన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ రూ.918 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. ఇదే కాలంలో కార్యకలాపాల ద్వారా రూ.4,001 కోట్ల ఆదాయం ఆర్జించింది.ం



# పోస్టాఫీస్ ఆర్‌డీనా ఎస్‌బీఐ ఆర్‌డీనా ఏదిలో ఎక్కువ రాబడి

**హైదరాబాద్, జూన్ 8 ::**

నెలనెలా కొంత మొత్తాన్ని పొదుపు చేస్తూ భవిష్యత్తు కోసం నిధిని సమకూర్చుకోవాలనుకునే వారికి రికరింగ్ డిపాజిట్ (ఆర్‌డీ) ఒక మంచి పెట్టుబడి మార్గంగా నిలుస్తోంది. మార్కెట్ ఒడిదుడుకుల ప్రభావం లేకుండా స్థిరమైన రాబడిని అందించే ఈ పథకం ముఖ్యంగా రిస్క్‌కు దూరంగా ఉండే మదుపరులను ఆకర్షిస్తోంది.ప్రస్తుతం అందుబాటులో ఉన్న వడ్డీ రేట్ల ప్రకారం నెలకు రూ.10,000 చొప్పున ఐదేళ్ల పాటు పోస్టాఫీస్ ఆర్‌డీలో పెట్టుబడి పెడితే మెచ్యూరిటీ సమయంలో సుమారు రూ.7,14,364 లభించే అవకాశం ఉంది. అదే మొత్తాన్ని ఐదేళ్ల పాటు ఎస్‌బీఐ ఆర్‌డీలో జమ చేస్తే సుమారు రూ.7,06,797 అందుతుంది. అంటే పోస్టాఫీస్ ఆర్‌డీ ద్వారా దాదాపు రూ.8,000 వరకు అదనపు ప్రయోజనం పొందవచ్చు.రికరింగ్ డిపాజిట్ అనేది ముందుగా నిర్ణయించిన కాలపరిమితి వరకు ప్రతి నెలా నిర్దిష్ట మొత్తాన్ని జమ చేసే పొదుపు పథకం. చిన్న మొత్తాలతోనే పెట్టుబడి ప్రారంభించవచ్చు. క్రమశిక్షణతో పొదుపు చేయాలనుకునే వారికి ఇది అనుకూలంగా ఉంటుంది.పోస్టాఫీస్ ఆర్‌డీలో నెలకు కనీసం రూ.100తో ఖాతా ప్రారంభించవచ్చు. గరిష్ఠ పెట్టుబడికి ఎలాంటి పరిమితి లేదు. అయితే ఖాతా ప్రారంభించిన మూడు సంవత్సరాల తర్వాత మాత్రమే ముందస్తు ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. మెచ్యూరిటీకి ముందే ఖాతాను మూసివేస్తే సాధారణ పొదుపు ఖాతా వడ్డీ రేటు ప్రకారమే లెక్కలు వేస్తారు.ఎస్‌బీఐలో కూడా రూ.100తో ఆర్‌డీ ఖాతా ప్రారంభించవచ్చు. అయితే నెలవారీ వాయిదాలు ఆలస్యమైతే జరిమానా విధిస్తారు. ఐదేళ్ల వరకు ఉన్న ఆర్‌డీలకు ప్రతి రూ.100పై నెలకు రూ.1.50 చొప్పున జరిమానా ఉంటుంది. ఐదేళ్లకు మించిన కాలపరిమితి ఉన్న ఖాతాలకు ప్రతి రూ.100పై నెలకు రూ.2 చొప్పున ఫైన్ వసూలు చేస్తారు. వరుసగా ఆరు నెలల పాటు వాయిదాలు చెల్లించకపోతే ఖాతా ముందుగానే మూసివేసే అవకాశం ఉంటుంది.సీనియర్ పౌరులకు ఎస్‌బీఐ ప్రత్యేకంగా అదనపు వడ్డీ ప్రయోజనాన్ని అందిస్తోంది. సాధారణ ఖాతాదారులకు 6.30 శాతం నుంచి 6.50 శాతం వరకు వడ్డీ లభిస్తుండగా, సీనియర్ సిటిజన్లకు అదనంగా 0.50 శాతం ఎక్కువ వడ్డీ అందుతోంది. దీంతో వారికి 6.80 శాతం నుంచి 7 శాతం వరకు వడ్డీ పొందే అవకాశం ఉంటుంది.స్థిరమైన ఆదాయం, భద్రత, క్రమబద్ధమైన పొదుపు లక్ష్యంగా పెట్టుకునే వారికి పోస్టాఫీస్, ఎస్‌బీఐ ఆర్‌డీలు రెండూ మంచి ఎంపికలే. అయితే ప్రస్తుత వడ్డీ రేట్ల ప్రకారం చూస్తే పోస్టాఫీస్ ఆర్‌డీ కొంత మెరుగైన రాబడిని అందిస్తోంది.

# మారుతి నుంచి కొత్త ఎస్‌యూవీల దండు..

**న్యూఢిల్లీ, జూన్ 8 :**




మారుతి సుజుకీ దేశీయ మార్కెట్లో మారుతున్న వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా తన వ్యూహాన్ని మార్చుకుం టోంది. 'విజన్ 3.0' ప్రణాళికలో భాగంగా ఎస్‌యూవీ విభాగంపై ప్రత్యేక దృష్టి సారిం చిన సంస్థ, రాబోయే సంవత్సరాల్లో తన మోడళ్ల సంఖ్యను 19 నుంచి 29కు పెంచా లని లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యంగా మధ్యతరగతి కుటుం బాలు, పెద్ద కుటుంబాలను ఆకర్షించేలా కొత్త హైబ్రిడ్ సాంకేతికతతో కూడిన వాహనాలను తీసుకురావడానికి సిద్ధమవుతోంది. ఈ జాబితాలో అత్యంత ఆసక్తిని రేకెత్తిస్తున్న మోడల్ ఫ్రాంక్స్ ఫేస్‌లిఫ్ట్. ఇందులో కొత్త తరం స్ట్రాంగ్ హైబ్రిడ్ ఇంజిన్‌ను అందించే అవకాశం ఉంది. ఈ సాంకేతి కతతో లీటరు పెట్రోలుకు సుమారు 35 కిలోమీటర్ల వరకు మైలేజీ లభించవచ్చని అంచనాలు వ్యక్తమవుతున్నాయి. పెరుగుతున్న ఇంధన ధరల నేపథ్యంలో ఈ కారు మధ్యతరగతి విని యోగదారులకు ఆకర్ష ణీయ ఎంపికగా మారే అవకాశం ఉంది. ఇప్ప టికే మార్కెట్లో మంచి ఆదరణ పొందు తున్న గ్రాండ్ విటారాను కూడా కొత్త రూపంలో తీసుకురాను న్నారు. ప్రస్తుతం ఉన్న ఐదు సీట్ల మోడల్‌కు తోడు మూడు వరుసల సీట్లతో కూడిన ఏడు సీట్ల వెర్షన్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఎక్కువ మంది కుటుంబ సభ్యులతో ప్రయాణించే వారికి అనువుగా ఈ వాహనం రూపొంద నుంది. విశాలమైన అంతర్గత స్థలం, అధిక బూట్ స్పేస్‌తో ఈ మోడల్ పెద్ద ఎస్‌యూవీ విభాగంలో గట్టి పోటీ ఇవ్వనుందని భావిస్తున్నారు.

# బంగారం ధరలకు బ్రేక్..

**హైదరాబాద్, జూన్ 8 ::**



గత వారం నుంచి కొనసాగుతున్న బంగారం ధరల తగ్గుదల ఈ వారం ఆరంభంలోనూ కొనసాగింది. అంతర్జా తీయ మార్కెట్‌లో బంగారం ధరలు బలహీనపడటంతో దేశీయ మార్కెట్‌లోనూ పసిడి ధరలు తగ్గుముఖం పట్టాయి. సోమవారం ఉదయం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,51,690కు చేరగా, క్రితం ముగింపు ధరతో పోలిస్తే రూ.1,040 మేర తగ్గింది. అదే సమయంలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.950 తగ్గి రూ.1,39,050 వద్ద నమోదైంది.బంగారం ధరలు తగ్గినా వెండి ధరల్లో మాత్రం ఎలాంటి మార్పు కనిపించలేదు. హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.2.70 లక్షల వద్ద స్థిరంగా కొనసాగుతోంది. విజయవాడ మార్కెట్‌లో కూడా దాదాపు ఇదే స్థాయి ధరలు నమోదవుతున్నాయి. ఇటీవల వరుసగా పెరిగిన పసిడి ధరలు సామాన్య కొనుగోలుదారులను ఆందోళనకు గురి చేయగా, తాజా తగ్గుదలతో నగల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్న వారిలో కొంత ఊరట కనిపిస్తోంది.దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో కూడా బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,53,490గా ఉండగా, 22 క్యారెట్ల బంగారం రూ.1,40,700 వద్ద కొనసాగుతోంది. ముంబైలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,51,690 కాగా, 22 క్యారెట్ల బంగారం రూ.1,39,050 వద్ద నమోదైంది. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,51,840గా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,39,200గా ఉంది.






# ఉద్యోగులకు డీఏ ఊరట పలు రాష్ట్రాల్లో పెంపు

**న్యూఢిల్లీ, జూన్ 8 ::**

దేశవ్యాప్తంగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిత్యావసర వస్తువుల ధరల నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, బ్యాంకు సిబ్బందికి కరువు భత్యం పెంపు రూపంలో ఊరట లభిస్తోంది. అఖిల భారత వినియోగదారుల ధరల సూచీ ఆధారంగా పలు రాష్ట్ర ప్రభుత్వాలు డీఏ, డీఆర్ పెంపులను ప్రకటించగా, పెండిం గ్‌లో ఉన్న బకాయిల చెల్లింపుల ప్రక్రియ కూడా వేగవంత ్మవుతోంది.అస్సాం ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్లకు కరువు భత్యం మరియు కరువు ఉపశమనాన్ని మరో 2 శాతం పెంచింది. దీంతో మొత్తం డీఏ 60 శాతానికి చేరుకుంది. ఈ నిర్ణయం వల్ల సుమారు 8 లక్షల మందికి పైగా లబ్ధి చేకూరనుంది. పెరిగిన భత్యం జూలై 5 నుంచి అమల్లోకి రానుంది.బీహార్ ప్రభుత్వం వివిధ వేతన సంఘాల పరిధిలో ఉన్న ఉద్యోగులకు 5 శాతం నుంచి 9 శాతం వరకు డీఏ పెంపును ప్రకటించింది. అదే విధంగా ఒడిశా ప్రభుత్వం ఉద్యోగులకు 2 శాతం డీఏ పెంచి, ఆ మొత్తాన్ని మే నెల జీతాలు, పెన్షన్లతో కలిపి ఖాతాల్లో జమ చేసింది.పలు రాష్ట్రాల్లో పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిల చెల్లింపులపై కూడా చర్యలు ప్రారంభమయ్యాయి. మహారాష్ట్ర ప్రభుత్వం 5వ, 6వ, 7వ వేతన సంఘాల పరిధిలోని ఉద్యోగులకు గత నవంబర్, డిసెంబర్, జనవరి నెలలకు సంబంధించిన సుమారు రూ.800 కోట్ల డీఏ బకాయిల విడుదలకు ఆమోదం తెలిపింది.పంజాబ్ ప్రభుత్వం 2021 జూలై నుంచి 2024 మార్చి వరకు పేరుకుపోయిన డీఏ బకాయిల చెల్లింపుల అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చింది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం డీఏ బకాయిల అంశంపై సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేస్తామని ప్రకటించింది .కర్ణాటకలో రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగ సంఘాలు జీతాల పెంపుతో పాటు 38 నెలల డీఏ బకాయిలను ఒకే విడతలో చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ అంశంపై ఆందోళన కార్యక్రమాలకు కూడా సిద్ధమవుతున్నట్లు సమాచారం.ఇక బ్యాంకింగ్ రంగంలో కూడా ఉద్యోగులకు ఊరట లభించింది. భారతీయ బ్యాంకుల సంఘం మే, జూన్, జూలై నెలలకు సంబంధించిన సవరించిన కరువు భత్యం రేట్లను ప్రకటి ంచింది. ఈ కొత్త రేట్లు అన్ని స్థాయిల బ్యాంకు ఉద్యోగులు, అధికారులకు వర్తించనున్నాయి.ప్రస్తుతం పాలు, కూరగాయ లు, ఇంధన ధరలు పెరుగుతున్న నేపథ్యంలో రానున్న జూలై నెలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మరో 2 నుంచి 3 శాతం వరకు అదనపు డీఏ పెంపు లభించే అవకాశముందని ఉద్యోగ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# టాటా ఈవీలపై భారీ తగ్గింపులు

**హైదరాబాద్, జూన్ 8 ::**



టాటా మోటార్స్ తన ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలను మరింత పెంచేందుకు జూన్ నెలలో ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. ఎలక్ట్రిక్ కారు కొనుగోలు చేయాలని భావిస్తున్న వినియోగదారులకు గ్రీన్ బోనస్‌లు, ఎక్స్ఛేంజ్ బెనిఫిట్లు, స్క్రాపేజ్ ప్రోత్సాహకాల రూపంలో భారీ ప్రయోజనాలు అందిస్తోంది. కంపెనీ ప్రకటించిన తాజా ఆఫర్ల ప్రకారం కర్వ్ ఈవీ మోడల్‌పై గరిష్ఠంగా రూ.3.35 లక్షల వరకు తగ్గింపు లభిస్తోంది. హారియర్ ఈవీపై రూ.2.75 లక్షల వరకు ప్రయోజనాలు అందుబాటులో ఉన్నాయి. పంచ్ ఈవీ, టియాగో ఈవీ మోడళ్లపై రూ.1.45 లక్షల వరకు తగ్గింపులు ఉండగా, నెక్సాన్ ఈవీ కొనుగోలుదారులు రూ.50 వేల వరకు లాభం పొందే అవకాశం ఉంది.దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు టాటా మోటార్స్ ఈ ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. పెరు గుతున్న ఇంధన ధరలు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన నేపథ్యంలో ఈవీలకు డిమాండ్ పెరుగుతుం డటంతో కంపెనీ వినియోగదారులను ఆకర్షించే దిశగా అడుగులు వేస్తోంది.అయితే ఈ తగ్గింపులు అన్ని వేరియం ట్లకు ఒకే విధంగా ఉండవు. మోడల్, వేరియంట్, ప్రాంతం, స్టాక్ లభ్యత ఆధారంగా ఆఫర్లలో మార్పులు ఉండొచ్చు. అలాగే ఎక్స్ఛేంజ్ బోనస్, స్క్రాపేజ్ బెనిఫిట్లను కొన్ని సందర్భాల్లో ఒకేసారి పొందడం సాధ్యం కాకపో వచ్చు.తక్కువ ధరలో ఆధునిక సాంకేతికతతో కూడిన ఎలక్ట్రిక్ వాహనాన్ని సొంతం చేసుకోవాలనుకునే వారికి ఇది మంచి అవకాశంగా భావిస్తున్నారు.




# దీర్ఘకాలిక పెట్టుబడులపై ఎల్‌ఐసీ దృష్టి

**న్యూఢిల్లీ, జూన్ 8 ::**

భారతీయ జీవిత బీమా కార్పొరేషన్ దీర్ఘకాలిక పెట్టుబడి సాధనాల కోసం అన్వేషణను ముమ్మరం చేసింది. ముఖ్యంగా యాన్యుటీ పాల సీలకు సంబంధించిన భవిష్యత్ చెల్లింపులను దృష్టిలో ఉంచుకుని, మరిన్ని దీర్ఘకాలిక పెటు ్టబడి అవకాశాలు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందని సంస్థ భావిస్తోంది.ఎల్‌ఐసీ సీఈఓ, ఎండీ ఆర్ దొరైస్వామి మాట్లాడుతూ, దీర్ఘకాలిక పెట్టుబడి సాధనాల అభివృద్ధి కోసం భారతీయ రిజర్వ్ బ్యాంక్, భారతీయ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు, బీమా నియంత్రణ మరియు అభివృద్ధి ప్రాధికార సంస్థలతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఎక్కువ మంది పాలసీదారులు యా న్యుటీ పాలసీల వైపు మొగ్గు చూపుతున్నారని, వాటి కింద 30 నుంచి 40 ఏళ్ల వరకు చెల్లింపు లు కొనసాగించాల్సి ఉంటుందని ఆయన వివరించారు. అందువల్ల ఆ బాధ్యతలకు అను గుణంగా సుదీర్ఘ కాలానికి స్థిరమైన రాబడులు అందించే పెట్టుబడి సాధనాలు అవసరమని పేర్కొన్నారు. మారుతున్న మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా కొత్త పెట్టుబడి అవకాశాలను గుర్తించేందుకు ఐఆర్‌డీఏఐ కూడా కసరత్తు చేస్తోందని దొరైస్వామి వెల్లడించారు. భవిష్య త్తులో బీమా రంగ అవస రాలను దృష్టిలో ఉ ంచుకుని పెట్టుబడి విధానాల్లో మార్పులు చోటు చేసుకునే అవకాశ ముందని తెలిపారు. మరోవైపు ఆర్థిక సాంకేతిక రంగంలో అడు గుపెట్టే అవకాశాలను కూడా ఎల్‌ఐసీ పరిశీలి స్తోంది. ఇందుకోసం ప్రత్యేక ఫిన్‌టెక్ సంస్థను ఏర్పాటు చేయాలా లేదా ఇప్పటికే కార్యకలా పాలు నిర్వహిస్తున్న ఫిన్‌టెక్ కంపెనీలో భాగస్వామ్యం పొందాలా అనే అంశంపై అధ్య యనం కొనసాగుతోందని దొరైస్వామి చెప్పారు. ఎల్‌ఐసీ వాటాల్లో మరింత విక్రయం విషయం లో తుది నిర్ణయం కేంద్ర ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు.



# గ్యాస్ ధరల పెంపు అనివార్యం కేంద్ర మంత్రి వివరణ

**ధార్వాడ్, జూన్ 8 ::**

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అసాధారణ పరిస్థితులు, అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌లో ఏర్పడిన సంక్షోభాల కారణంగానే వంట గ్యాస్ ధరలను పెంచాల్సి వచ్చిందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. కర్ణాటకలోని ధార్వాడ్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, గ్యాస్ ధరల పెంపు పట్ల కేంద్ర ప్రభుత్వం కూడా బాధపడుతోందని, అయితే అంతర్జాతీయ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని చెప్పారు. ప్రస్తుతం ఎల్‌పీజీ సరఫరా పరిమిత వనరులపైనే ఆధారపడుతోందని ఆయన పేర్కొన్నారు. దేశీ య అవసరాలను తీర్చేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం సుదూర దేశాల నుంచి కూడా గ్యాస్‌ను దిగుమతి చేసుకుంటోం దన్నారు. దీంతో రవాణా ఖర్చులు, కొనుగోలు వ్యయం భారీగా పెరిగాయని వివరించారు. విదేశాల నుంచి గ్యాస్ రవాణాకు 40 నుంచి 45 రోజుల సమయం పడుతుండటంతో బీమా వ్యయాలు కూడా గణనీయంగా పెరిగాయని తెలిపారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్ ధరపై మరో రూ.29 పెంపును ప్రకటించింది. గత మూడు నెలల వ్యవధిలో ఇది రెండోసారి ధరల పెంపు కావడం గమనార్హం. అంతకుముందు మార్చి నెలలో కూడా ఒక్కో సిలిండర్‌పై రూ.60 పెంచారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు, గ్యాస్ ధరలు పెరగడం ఈ నిర్ణయాలకు ప్రధాన కారణమని ప్రభుత్వం చెబుతోంది.ం

## రూ.300 కోట్ల దిశగా 'పెద్ది వసూళ్లలో జోరు

రామ్ చరణ్ కథానాయకుడిగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కిన భారీ క్రీడా నేపథ్య చిత్రం 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన ప్రదర్శన కొనసాగిస్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే భారీ వసూళ్లు సాధిస్తున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా కలెక్షన్ల వర్షం కురిపిస్తూ సినీ వర్గాల దృష్టిని ఆకర్షిస్తోంది.నిర్మాతలు వెంకట సతీష్ కిలారు, ఇషాన్ సక్సేనా నిర్మించిన ఈ చిత్రం భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అందించిన సంగీతం, ప్రముఖ ఛాయా గ్రాహకుడు రత్నవేలు అందించిన దృశ్యాలు సినిమాకు ప్రధాన ఆకర్షణలుగా నిలిచాయి. విడుదలైన తొలిరోజే ఈచిత్రం ప్రపంచ వ్యాప్తంగా రూ.135.36 కోట్ల స్థూలవసూళ్లు సాధించి సంచలనం సృష్టించింది. రెండో రోజు రూ.46.44 కోట్లు, మూడో రోజు రూ.54.90 కోట్లు రాబట్టిన ఈ చిత్రం తొలి మూడు రోజుల్లోనే రూ.236.70 కోట్ల స్థూల వసూళ్లను దాటింది.ఆదివారం కూడా అదేజోరు కొనసాగించిన 'పెద్ది' తొలి వారాంతం ముగిసే సమయానికి ప్రపంచ వ్యాప్తంగా రూ.292.50 కోట్ల స్థూలవసూళ్లు సాధించి నట్లు చిత్ర నిర్మాణ సంస్థ ప్రకటించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రత్యేక పోస్టర్‌లో చిత్రాన్ని బాక్సాఫీస్ విజేతగా అభివర్ణించింది.




### పెద్ది వివాదంపై నిత్యామీనన్ స్పందన
## ఆసక్తికర వ్యాఖ్యల

రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కిన 'పెద్ది' చిత్రం విడుదలైన తర్వాత కథానాయిక పాత్రకు సంబంధించిన వివాదం ఇంకా చర్చనీయాంశంగానే కొనసాగుతోంది. సినిమాలో కథానాయికను మరింత ఆకర్షణీయంగా చూపించారంటూ సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వెల్లువెత్తడంతో ఈ అంశం పెద్ద చర్చకు దారి తీసింది. ఈ వివాదంపై ఇప్పటికే పలువురు సినీ ప్రముఖులు స్పందించగా, తాజాగా నటి నిత్యా మీనన్ కూడా తన అభిప్రాయాన్ని వెల్లడించారు.కథానాయికలను కేవలం అందాల ప్రదర్శన కోణంలో చూపించడం ఒక్క తెలుగు చిత్ర పరిశ్రమకే పరిమితం కాదని, దాదాపు అన్ని చిత్ర పరిశ్రమల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోందని ఆమె పేర్కొన్నారు. ప్రేక్షకులను ఆకర్షించాలనే ఉద్దేశంతో కొందరు దర్శకులు, నిర్మాతలు అలాంటి విధానాన్ని అనుసరిస్తున్నారని చెప్పారు. చిత్రాలు మరింత వ్యాపారపరంగా మారుతున్న కొద్దీ కొన్ని సందర్భాల్లో హద్దులు దాటే పరిస్థితులు కూడా ఏర్పడుతున్నాయని అభిప్రాయపడ్డారు.అయితే ఈ విషయంలో కేవలం దర్శకులను మాత్రమే తప్పుబట్టడం సరైంది కాదని నిత్యామీనన్ అన్నారు. కొంత మంది కథానాయికలు అలాంటి పాత్రలను స్వీకరించడానికి సిద్ధంగా ఉండటంతో దర్శకులు కూడా వారిని అదే కోణంలో చూపిస్తుంటారని పేర్కొన్నారు. ఇది పూర్తిగా ఒకవైపు జరిగే విషయం కాదని స్పష్టం చేశారు.తన వ్యక్తిగత అనుభవాన్ని పంచుకుంటూ, గతంలో కొందరు దర్శకులు తనను పూర్తిగా అందాల ప్రదర్శనకు ప్రాధాన్యం ఉన్న పాత్రల కోసం సంప్రదించారని, అయితే అలాంటి పాత్రలు చేయడం ఇష్టం లేక తాను తిరస్కరించానని తెలిపారు.





### బాలనటి నుంచి బాలీవుడ్ వరకు
## రోష్ని ప్రస్థానం

చిన్న వయసులోనే కెమెరా ముందుకు వచ్చి తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న నటి రోష్ని వాలియా ప్రస్తుతం బాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకునే దిశగా అడుగులు వేస్తోంది. వాణిజ్య ప్రకటనల ద్వారా వినోద రంగంలోకి ప్రవేశించిన ఆమె, అనంతరం టెలివిజన్ ధారావాహికలు, సినిమాలు, సామాజిక మాధ్యమాల ద్వారా విశేష ఆదరణ పొందింది.రోష్ని వాలియా తొలిసారిగా మై లక్ష్మీ తేరే ఆంగన్ కీ ధారావాహికతో టెలివిజన్ రంగంలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత భారత్ కా వీర్ పుత్ర మహా రాణా ప్రతాప్లో యువ అజబ్దే పాత్రలో నటించి మంచి గుర్తింపు తెచ్చు కుంది. భావోద్వేగాలను సహజంగా వ్యక్తపరుస్తూ చిన్న వయసులోనే ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. ఈ పాత్ర ఆమె నట జీవితంలో కీలక మలుపుగా నిలిచింది.తరువాత తారా ఫ్రమ్ సతారా ద్వారా మరోసారి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. యువత కలలు, కుటుంబ బంధాలు, నృత్యం నేపథ్యంగా సాగిన ఈ ధారావాహికలో ఆమె నటనకు మంచి స్పందన లభించింది. బాలనటిగా ప్రారంభమైన ఆమె ప్రయాణం క్రమంగా విభిన్న పాత్రలతో విస్తరించింది.సినీ రంగంలో రోష్ని తొలిసారిగా మై ఫ్రెండ్ గణేశా 4లో బాలనటిగా కనిపించింది. అనంతరం పలు చిత్రాల్లో నటిస్తూ వెండితెరపై తన స్థానాన్ని బలప రుచుకుంది. ఇటీవల అజయ్ దేవగన్, మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రల్లో నటించిన సన్ ఆఫ్ సర్దార్ 2లో రోష్ని కీలక పాత్ర పోషించింది. ఈ చిత్రం ఆమె కెరీర్‌లో మరో ముఖ్యమైన అడుగుగా నిలిచిందని సినీ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి.టెలివిజన్ నుంచి బాలీవుడ్ వరకు తన ప్రతిభను నిరూపించు కుంటూ వచ్చిన రోష్ని వాలియా, యువతలో మంచి అభిమాన వర్గాన్ని సంపాదించుకుంది. సామాజిక మాధ్యమాల్లోనూ ఆమెకు లక్షలాది మంది అనుచరులు ఉన్నారు. ఫ్యాషన్, గ్లామర్, చిత్రీకరణ విశేషాలు, వ్యక్తిగత క్షణాలను అభిమానులతో పంచుకుంటూ నిరంతరం వారితో అనుసంధానంగా ఉంటోంది. భవిష్యత్తులో మరిన్ని పెద్ద చిత్రాల్లో అవకాశాలు అందుకునే నటీమణుల్లో రోష్ని వాలియా పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.

### ఓటీటీలోకి వస్తున్న వీరభద్రుడు తేదీ
## ఖరారు

స్టార్ హీరోసూర్య నటించిన తాజా విజయవంతమైన చిత్రం 'కరుప్పు' తెలుగులో 'వీరభద్రుడు' పేరుతో ప్రేక్షకులను అలరించిన సంగతి తెలిసిందే. థియేటర్లలో ఘన విజయాన్ని అందుకున్న ఈ చిత్రం ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతోంది. మే 15న విడుదలైన ఈ సినిమా భారీ వసూళ్లను సాధించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది.ఈ చిత్రాన్ని ఓటీటీలో ఎప్పుడు విడుదల చేస్తారనే విషయంపై అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తుండగా, తాజాగా విడుదల తేదీ ఖరారైంది. ప్రముఖ డిజిటల్ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ చిత్ర ప్రసార హక్కులను సొంతం చేసుకుంది. జూన్ 12 నుంచి ఈ సినిమా ప్రేక్షకులకు అందుబాటులోకి రానుంది. తమిళంతో పాటు తెలుగులో కూడా ఈ చిత్రాన్ని వీక్షించే అవకాశం కల్పించనున్నారు.ఈ చిత్రానికి ఆర్జే బాలాజీ దర్శకత్వం వహించడంతో పాటు కీలక పాత్రలో నటించారు. సూర్యకు జోడీగా త్రిష నటించగా, ఇంద్రాన్స్, నట్టి సుబ్రమణియన్, అనఘ మాయ రవి, సుప్రీత్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. సంగీతాన్ని సాయి అభ్యంకర్ అందించారు.



### 'రామాయణం'లో కాజల్
## పాత్ర ఖరారు

దర్శకుడు నితేష్ తివారీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న 'రామాయణం' చిత్రంలో తాను నటిస్తున్నట్లు ప్రముఖ నటి కాజల్ అగర్వాల్ అధికారికంగా ధృవీకరించారు. గత కొంతకాలంగా వస్తున్న ప్రచారాలకు తెరదించుతూ, ఈ భారీ చిత్రంలో తాను భాగమవుతున్నానని వెల్లడించారు.ఇటీవల జరిగిన ఓ అవార్డుల కార్యక్రమంలో మాట్లాడిన కాజల్ అగర్వాల్, ఈ సినిమా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. భారతీయ సినీ చరిత్రలో ఇప్పటివరకు చూడని స్థాయిలో అత్యాధునిక సాంకేతికతతో ఈ చిత్రం రూపొందుతోందని, తన కెరీర్‌లో ఇది ప్రత్యేకమైన మైలురాయిగా నిలుస్తుందని ఆమె పేర్కొన్నారు.ఈ చిత్రంలో రావణుడి భార్య మండోదరి పాత్రను కాజల్ అగర్వాల్ పోషించ నున్నారు. రామాయణ గాథలో కీలక మైన పాత్రల్లో ఒకటైన మండోదరిని వెండితెరపై ఎలా ఆవిష్కరిస్తారన్న ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది.ఇక ఈ భారీ చిత్రంలో శ్రీరాముడి పాత్రలో రణబీర్ కపూర్, సీత పాత్రలో సాయిపల్లవి, రావణుడి పాత్రలో యశ్ నటిస్తున్నారు. అలాగే హనుమంతుడి పాత్రను సన్నీ డియోల్ పోషిస్తున్నారు.భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయాలని నిర్మాతలు నిర్ణయించారు.





## పెద్ది కోసం ప్రాణం పెట్టా జగపతిబాబు భావోద్వేగ వ్యాఖ్యలు

రామ్ చరణ్ కథానాయకుడిగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కిన భారీ క్రీడా నేపథ్య చిత్రం 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. విడుదలైన కొద్ది రోజుల్లోనే భారీ వసూళ్లు సాధించిన ఈ చిత్రం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో చిత్రంలో కీలక పాత్ర పోషించిన సీనియర్ నటుడు జగపతిబాబు తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు.ఈ చిత్రంలో 'అప్పలసూరి' పాత్రలో నటించిన జగపతిబాబు తన సినీ జీవితంలో ఈ సినిమా ఎంతో ప్రత్యేకమైందని తెలిపారు. మధ్యలో ఎన్నో చిత్రాల్లో నటించినప్పటికీ ఈ సినిమా విడుదల కోసం ప్రత్యేకంగా ఎదురు చూశానని చెప్పారు. సినిమా విడుదలైన తర్వాత ఒక ప్రముఖ దర్శకుడు తనకు ఫోన్ చేసి, ఇంత గొప్ప పాత్ర చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో చర్చ జరగడం లేదని చెప్పినట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా చిత్ర పరిశ్రమలో నటులకు లభించే గుర్తింపు గురించి కూడా ఆయన మాట్లాడారు. చాలా సందర్భాల్లో ఇతర భాషల నటులకు ఎక్కువ గౌరవం లభిస్తుందని, తాను ఇతర భాషల్లో పనిచేసిన సమయంలో కూడా అలాంటి ఆదరణను చూశానని పేర్కొన్నారు. అయితే తనకు దానిపై ఎలాంటి అసంతృప్తి లేదని, కానీ 'పెద్ది' కోసం ఎంత కష్టపడ్డానో తనకు తెలుసని అన్నారు.చిత్రీకరణ సమయంలో ప్రతి సన్నివేశం పూర్తైన తర్వాత చిత్ర బృందం సభ్యులు చప్పట్లు కొట్టి అభినందించేవారని గుర్తుచేసు కున్నారు. సినిమా కోసం తన శక్తి మేరకు పనిచేశానని, అందుకే ఈ పాత్రకు మరింత గుర్తింపు రావాలని కోరుకోవడంలో తప్పేమీ లేదన్నారు. ఈ సినిమా కోసం తాను ప్రాణం పెట్టి పనిచేశానని, అందుకే గుర్తింపు అడిగే హక్కు తనకు ఉందని స్పష్టం చేశారు. ఇతర చిత్రాల విషయంలో తాను ఎప్పుడూ ఇలా మాట్లాడలేదని చెప్పారు.



## బాలయ్య సినిమాకు రాజశేఖర్ విలన్?

నటసింహం బాలకృష్ణ, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ చిత్రంపై సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచుతోంది. ఈ చిత్రంలో బాలకృష్ణకు ప్రతినాయకుడిగా సీనియర్ నటుడు రాజశేఖర్ నటించే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. సినీ వర్గాల సమాచారం ప్రకారం, రాజశేఖర్ కోసం ప్రత్యేకంగా శక్తివంతమైన పాత్రను రూపొందించినట్లు తెలుస్తోంది. సాధారణ ప్రతినాయకుడి పాత్రకు భిన్నంగా, కథలో కీలక ప్రాధాన్యం కలిగిన పాత్రగా దీనిని మలిచినట్లు సమాచారం. బాలకృష్ణ పాత్రకు సమాన స్థాయిలో నిలిచేలా ఈ పాత్రను తీర్చిదిద్దుతున్నారని టాలీవుడ్‌లో చర్చ నడుస్తోంది. సామాజిక అంశాలను వాణిజ్య హంగులతో మేళవించి విజయవంతమైన చిత్రాలు తెరకెక్కించిన కొరటాల శివ, ఈసారి కూడా అదే తరహా కథను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. బాలకృష్ణకు ఉన్న మాస్ ఇమేజ్, శక్తివంతమైన సంభాషణలు, యాక్షన్ అంశాలు ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఇక రాజశేఖర్ ఈ సినిమాలో నటిస్తే, ఆయన కెరీర్‌లో మరో విభిన్న పాత్రగా నిలిచే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గతంలో కథానాయకుడిగా ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆయన, ప్రతినాయక ఛాయలు ఉన్న పాత్రలో కనిపిస్తే తెరపై కొత్త అనుభూతిని అందించగలరని భావిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతాన్ని అనిరుధ్ రవిచందర్ అందించే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. భారీ స్థాయిలో రూపొందనున్న ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే రాజశేఖర్ పాత్రకు సంబంధించి చిత్ర బృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.




# అఫ్ఘాన్‌పై భారత్ ఘన విజయం

**ఇన్నింగ్స్, 300 పరుగుల తేడాతో రికార్డు విక్టరీ!**

**టెస్టుల్లో టీమ్ఇండియాకు ఇదే అతిపెద్ద గెలుపు**

**మూడో రోజే చేతులెత్తేసిన అఫ్గానిస్థాన్**

**స్పిన్ మాయాజాలంతో అదరగొట్టిన సుందర్, కుల్‌దీప్, మానవ్ సుతార్**

ముల్లాన్‌పూర్, జూన్ 08: అఫ్గానిస్థాన్‌తో జరిగిన ఏకైక ప్రతిష్ఠాత్మక టెస్టు మ్యాచ్‌లో ఘన విజయం సాధించింది. పర్యాటక జట్టుపై ఇన్నింగ్స్ మరియు 300 పరుగుల భారీ తేడాతో గెలిచింది. టెస్టు క్రికెట్ చరిత్రలోనే పరుగుల పరంగా భారత జట్టుకు ఇదే అతిపెద్ద విజయం కావడం విశేషం. తొలి ఇన్నింగ్స్‌లో 113/5 ఓవర్‌నైట్ స్కోరుతో మూడో రోజు ఆటను కొనసాగించిన అఫ్గానిస్థాన్.. భారత బౌలర్ల ధాటికి కేవలం 152 పరుగులకే కుప్పకూలింది. అఫ్గాన్ బ్యాటర్లలో రహ్మత్ షా (135 బంతుల్లో 60) ఒక్కడే ఒంటరి పోరాటం చేయగా, మిగతా వారంతా తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు. దీంతో మొదటి ఇన్నింగ్స్‌లో 412 పరుగుల భారీ ఆధిక్యం సంపాదించిన భారత్, ప్రత్యర్థికి ఫాలోఆన్ విధించింది.

**రెండో ఇన్నింగ్స్‌లోనూ అదే దారుణ ప్రదర్శన..**

ఫాలోఆన్ ఆరంభించిన అఫ్గానిస్థాన్ రెండో ఇన్నింగ్స్‌లో మరింత ఘోరంగా ఆడింది. టీ విరామ సమయానికి 5 వికెట్ల నష్టానికి 98 పరుగులు చేసిన ఆ జట్టు, చివరి సెషన్ ప్రారంభమైన కొద్దిసేపటికే వరుసగా వికెట్లు కోల్పోయింది. చివరకు 112 పరుగులకే ఆ జట్టు తొమ్మిది వికెట్లు నష్టపోయింది. అఫ్గాన్ బ్యాటర్ షరాఫుద్దీన్ అష్రఫ్ గాయం కారణంగా బ్యాటింగ్‌కు దిగకపోవడంతో అంతటితో ఆ జట్టు ఇన్నింగ్స్ ముగిసి భారత్‌ను విజయం వరించింది. రెండో ఇన్నింగ్స్‌లో ఓపెనర్ సెధిఖుల్లా అటల్ (42) టాప్ స్కోరర్‌గా నిలవగా, రహ్మనుల్లా గుర్బాజ్ (24), రహ్మత్ షా (13) మాత్రమే కాస్త పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. భారత బౌలర్లలో వాషింగ్టన్ సుందర్ (4/36), కుల్‌దీప్ యాదవ్ (3/30) తమ స్పిన్ మాయాజాలంతో ప్రత్యర్థి బ్యాటర్లకు చుక్కలు చూపించారు. మానవ్ సుతార్, సిరాజ్ చెరో వికెట్ పడగొట్టారు.

**తొలి ఇన్నింగ్స్‌లో కొండంత స్కోరు..**

అంతకుముందు టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. తన తొలి ఇన్నింగ్స్‌ను 564/8 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. భారత ఇన్నింగ్స్‌లో శుభ్‌మన్ గిల్ (126), కేఎల్ రాహుల్ (100) సెంచరీలతో కదం తొక్కగా.. సాయి సుదర్శన్ (81), రిషభ్ పంత్ (81), వాషింగ్టన్ సుందర్ (52బి) పరుగులతో అదరగొట్టారు. లోయర్ ఆర్డర్‌లో మానవ్ సుతార్ (28), ఓపెనర్ యశస్వి జైస్వాల్ (24), ధ్రువ్ జురెల్ (19) పరుగులు జోడించారు. ఆ తర్వాత బౌలింగ్‌లోనూ భారత్ పంజా విసిరింది. అఫ్గాన్ తొలి ఇన్నింగ్స్‌లో అరంగేట్ర స్పిన్నర్ మానవ్ సుతార్ (6/33) అద్భుత ప్రదర్శనతో సత్తాచాటగా, పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ (3/37) రాణించి జట్టుకు తిరుగులేని ఆధిక్యాన్ని అందించారు. బ్యాటింగ్, రెండు రంగాల్లోనూ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన భారత్.. మూడో రోజే మ్యాచ్‌ను ముగించి రికార్డుల విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది.




## రిటైర్ కావాలనుకుంటున్నారా?: హర్మన్ ప్రీత్

మహిళల టీ20 ప్రపంచకప్ జూన్ 12 నుంచి ప్రారంభం కానుంది. టోర్నీ ఆరంభానికి సమయం దగ్గరపడటంతో ప్రచార కార్యక్రమాలు ఊపందుకున్నాయి. ఇటీవల అన్ని జట్ల కెప్టెన్లతో ఫొటోషూట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించగా భారత జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌ను విలేకరులు పలు ప్రశ్నలు అడిగారు. ఈ టీ20 ప్రపంచ కప్ మీకు చివరిది అవుతుందా అని ఓ రిపోర్టర్ హర్మన్‌ప్రీత్‌ను ప్రశ్నించారు. దీనికి ఆమె 'నేను తప్పుకోవాలని మీరు కోరుకుంటున్నారా" అని ఎదురు ప్రశ్న వేశారు. 'మీ ప్రణాళికలు గురించి తెలుసుకునేందుకే ఈ ప్రశ్న అడిగా. టీ20 నుంచి వైదొలగడానికి సమయం రాలేదని మీరు భావిస్తున్నందుకు సంతోషిస్తున్నాను' అని విలేకరి సమాధానమిచ్చారు. అయినప్పటికీ హర్మన్‌ప్రీత్ తగ్గలేదు. 'మరి అలాంటప్పుడు ఈ ప్రశ్న ఎందుకు అడుగుతున్నారు' అంటూ అసహనం వ్యక్తం చేశారు. హర్మన్‌ప్రీత్ సారథ్యంలో గతేడాది జరిగిన వన్డే ప్రపంచకప్‌ను భారత్ సాధించడంతో ఈ టీ20 వరల్డ్ కప్‌లో టీమ్ఇండియాపై అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. బయటి నుంచి వచ్చే ఒత్తిడి గురించి ఎక్కువగా ఆలోచించకుండా ఉండటానికి ప్రయత్నిస్తానని హర్మన్‌ప్రీత్ పేర్కొన్నారు. "విజయంతో (వన్డే వరల్డ్ కప్) సహజంగానే మరిన్ని అంచనాలు వస్తాయి. కానీ, మహిళల క్రికెట్‌కు ఇది సానుకూల సంకేతంగా నేను చూస్తున్నాను. మ్యాచ్‌ల విషయంలో ప్రజలు ఎంతో భావోద్వేగంతో ఉంటారు. వారు ఎప్పటికప్పుడూ మమ్మల్ని నిశితంగా పరిశీలిస్తారు. వ్యక్తిగతంగా నేను బయటినుంచి వచ్చే ఒత్తిడి గురించి ఆలోచించకుండా ఉండటానికి ప్రయత్నిస్తాను. సన్నద్ధత, జట్టుకు సహకారం అందించడం, వర్తమానంలో ఏం జరుగుతుంది అనే దానిపైనే నా దృష్టి ఉంటుంది. భారీ అంచనాలు ఎల్లప్పుడూ ఉంటాయి. ఇలాంటి సమయంలో బయటి విషయాలను పట్టించుకోకుండా నా ఆట పైనే ఫోకస్ ఉండేలా చూసుకోవాలి" అని హర్మన్‌ప్రీత్ వివరించారు. టీ20 ప్రపంచకప్‌లో భారత్ తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్‌తో తలపడనుంది. ఎడ్జ్‌బాస్టన్‌లో జూన్ 14న ఈ దాయాదుల పోరు జరగనుంది.



## టాలెంట్ ఉన్నా పట్టించుకోలేదు

ఐపీఎల్ వేలంపై రాజస్థాన్ రాయల్స్ టీనేజ్ సెన్సేషన్, యూనివర్సల్ బేబీ బాస్ వైభవ్ సూర్యవంశీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. వేలంలో తన కోసం రెండు జట్లే పోటీపడటం తనను తీవ్రంగా నిరాశపర్చిందని చెప్పాడు. తాజాగా రాజస్థాన్ రాయల్స్ సోషల్ మీడియా వేదికగా షేర్ చేసిన వీడియోలో వైభవ్ సూర్యవంశీ ఈ విషయాన్ని వెల్లడించాడు. 'నేను బాగా ఆడుతాను. ట్రయల్స్‌లోనూ బాగా పర్ఫార్మ్ చేశాను. అయినా వేలంలో నా కోసం రెండే జట్లే బిడ్ వేశాయి. మిగతా టీమ్స్ ఎందుకు పట్టించుకోలేదని నేను చాలా బాధపడ్డాను. కానీ రాజస్థాన్ రాయల్స్‌లోకి తీసుకొచ్చినందుకు ఈ ఏడాదిన్నర కాలంలో ఆ దేవుడికి కనీసం వెయ్యి సార్లయినా కృతజ్ఞతలు చెప్పుకుని ఉంటాను. ఇక్కడి కోచ్‌లు, సపోర్ట్ స్టాఫ్, ఆటగాళ్లు, మేనేజ్‌మెంట్, మీడియా టీమ్, ఫిజియోలు, ట్రైనర్లు.. అందరూ ఒక కుటుంబంలా ఉంటారు. ఇక్కడ ఉంటే మన సొంత ఇల్లులాగే ఎంతో సౌకర్యంగా అనిపిస్తుంది. ఎవరితోనైనా మన మనసులోని మాటను, భావాలను పంచుకోవచ్చు. ఈ ఫ్రాంచైజీలోకి వచ్చినందుకు నేను ఎంత సంతోషంగా ఉన్నానో మాటల్లో చెప్పలేను. జట్టులోని సీనియర్లు అందరూ నాకు ఎంతో మంచి మార్గదర్శకత్వం అందిస్తారు. ఏది మంచిది, ఏం చేయాలి, ఏం చేయకూడదు అని చెప్తారు. ఇక్కడ నేను నేర్చుకోవడానికి చాలా విషయాలు ఉన్నాయి.'అని వైభవ్ సూర్యవంశీ ఆనందం వ్యక్తం చేశాడు.




## మెక్సికోలోనే ఇరాన్ జట్టు

**ఫిఫా వరల్డ్ కప్‌లో వింత పరిస్థితి**

2026 ఫిఫా వరల్డ్ కప్‌లో పాల్గొనేందుకు వచ్చిన ఇరాన్ జాతీయ ఫుట్‌బాల్ జట్టు, ఆతిథ్య దేశమైన అమెరికాలో అడుగుపెట్టకుండా సరిహద్దులోని మెక్సికో నగరమైన టిజువానాకు చేరుకుంది. అమెరికా, ఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధ వాతావరణం, వీసా నిబంధనల కారణంగా ఈ విచిత్ర పరిస్థితి ఏర్పడింది. ఈ పరిణామం క్రీడా ప్రపంచంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అమెరికా తమ పట్ల వివక్ష చూపుతోందని, ఉద్దేశపూర్వకంగానే అడ్డంకులు సృష్టిస్తోందని ఇరాన్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ అధ్యక్షుడు మెహదీ తాజ్ తీవ్ర ఆరోపణలు చేశారు. జూన్ 15న లాస్ ఏంజిల్స్‌లో న్యూజిలాండ్‌తో జరగనున్న మొదటి మ్యాచ్‌కు కేవలం ఒక్కరోజు ముందు మాత్రమే తమ ఆటగాళ్లకు వీసాలు జారీ చేశారని ఆయన తెలిపారు. సహాయక సిబ్బంది, మీడియా ప్రతినిధులు చాలామందికి ఇంకా వీసాలు రాలేదని, దీనిపై ఫిఫాకు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. ఈ ఆరోపణలపై ఒక అమెరికా అధికారి స్పందించారు.




## సీఎం విజయ్‌కు ప్రజ్ఞానంద చెక్!

చెన్నై: నార్వే చెస్ టైటిల్ గెలిచిన గ్రాండ్‌మాస్టర్ ఆర్ ప్రజ్ఞానంద.. అదే ఊపులో ఉన్నారు. ఇవాళ తమిళనాడు సీఎం విజయ్‌ని కూడా ప్రజ్ఞానంద ఓ గేమ్‌లో ఓడించారు. నార్వే టైటిల్ గెలిచిన సందర్భంగా సీఎం విజయ్‌ని ఆ రాష్ట్ర సెక్రటేరియేట్‌లో ప్రజ్ఞానంద కలిశారు. ఆ సమయంలో ఇద్దరూ కాసేపు సరదాగా చెస్ ఆడారు. అయితే కేవలం కొన్ని ఎత్తుల్లోనే సీఎం విజయ్‌కు గ్రాండ్‌మాస్టర్ చెక్ పెట్టేశారు. చెస్ స్టార్ ప్రజ్ఞానందకు 50 లక్షల ప్రత్యేక నజరానా సీఎం అందజేశారు. అయితే సీఎం విజయ్ చెస్ ఆడిన తీరును ప్రజ్ఞానంద మెచ్చుకున్నారు. సీఎంతో చెస్ ఆడడం అద్భుతమైన అనుభూతిని ఇచ్చిందన్నాడు. విజయ్, ప్రజ్ఞానంద చెస్ ఆడిన విలువల్స్‌ను రిలీజ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన నగదు పురస్కారం తనలో ప్రేరణ ఇస్తోందన్నారు. సీఎం విజయ్ చెస్ ఆడుతారన్న సంగతి తనకు తెలియదని, చెస్ బోర్డు తెమ్మన్నారని, టేబుల్‌పై చెస్ ఆడామని ప్రజ్ఞానంద తెలిపారు. తన స్నేహితులతో కలిసి చెస్ ఆడేవాడినని సీఎం విజయ్ చెప్పినట్లు తెలిపారు. గేమ్ నేనే గెలిచినా, సీఎం బాగా ఆడారని అన్నాడు.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467